## పన్నులు తగ్గడంతో మారుతీ సుజుకి, హ్యూండాయ్ కార్ల కోసం రికార్డు బుకింగ్‌లు

జీఎస్టీ పన్నులు తగ్గడంతో పాటు పండుగ సీజన్, కంపెనీలు ధరలు సవరించడంతో ఈ ఏడాదికి వాహన పరిశ్రమ రికార్డు స్థాయిలో డిమాండ్‌ను చూస్తోంది. ఇప్పటికే మారుతీ సుజుకి, హ్యూండాయ్ మోటార్ ఇండియా ఊహించని స్థాయిలో బుకింగ్‌లు సాధించామని వెల్లడించాయి. గత 35 ఏళ్లలో చూడని స్థాయిలో జీఎస్టీ తగ్గింపు నిర్ణయం అమలులోకి రావడంతో సోమవారం మొదటిరోజే 80,000 ఎంక్వైరీలు వచ్చాయని, 25,000 కంటే ఎక్కువ కార్లను డెలివరీ చేశామని వెల్లడించింది.


ప్రభాత సూర్య PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 24 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79



విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD






## హెచ్-1బీ 'లాటరీ' విధానంలో మార్పులు!

- ఎంపికకు కొత్త ప్రతిపాదనలు
- అధిక నైపుణ్యం ఉన్న, ఉత్తమ వేతనాలు పొందే నిపుణుల ఎంపిక కోసం తాజా ప్రతిపాదనలు సిద్ధం
- ప్రస్తుతం ఉన్న లాటరీ విధానంలో కీలక మార్పులు తెచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం
- హెచ్-1బీ వీసా ఎంపిక ప్రక్రియలో ఈ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలు ఫెడరల్ రిజిస్ట్రార్ తాజాగా విడుదల

3



## ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపాను

- ట్రంప్ నోట అదే మాట
- మరే ఇతర అధ్యక్షుడు వాటిని ఆపే ప్రయత్నం చేయలేదు

# మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి

- కుంభమేళాకు వేల కోట్లు ఇస్తున్న కేంద్రం..
- ఆదివాసీ జాతరకు ఎందుకు ఇవ్వడంలేదు?
- గద్దెల పునఃనిర్మాణం.. ఓ భావోద్వేగం
- పోరాటానికి, స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ
- తల్లుల ఆశీర్వాదంతోనే ప్రజాప్రభుత్వం
- ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- మహాజాతరకు మళ్లీ వస్తా: సీఎం రేవంత్





వరంగల్/ములుగు/తాడ్వాయి


మేడారం మహాజాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కుంభమేళాకు కేటాయిస్తున్నట్లుగానే రూ.వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు జిల్లా మేడారం మహాజాతరలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ప్రాంగణం పునఃనిర్మాణ పనులను సీఎం ప్రారంభించారు. పునఃనిర్మాణ మాస్టర్‌ప్లాన్‌పై ఆదివాసీలు, గిరిజనులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, అనంతరం మేడారంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "కుంభమేళాకు వేల వేల కోట్లు ఇస్తున్నారు. కానీ, మా ఆదివాసీ కుంభమేళాకు ఒక్క రూపాయి ఇవ్వడానికిగానీ, జాతీయ పండుగగా గుర్తించడానికిగానీ కేంద్రానికి ఎందుకో మనసు రావడం లేదు. కుంభమేళా, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య మాత్రమే కాదు.. తెలంగాణ ప్రాంతంలో ములుగు అడవుల్లో ఉన్న సమ్మక్క, సారలమ్మ కూడా ఓ గొప్ప దేవాలయం. పోరాట పటిమకు, పౌరుషానికి మారుపేరు. రాచరికంపై తిరుగుబాటు చేసి.. జెండా ఎగురవేసిన సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ పండుగ గుర్తింపు రావాలి. వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం - మిగతా2లో

## దండకారణ్యానికి భారీగా బలగాలు

కశ్మీర్ నుంచి తరలింపు..


మావోయిస్టుల అగ్ర నాయకత్వం అంతమే లక్ష్యం

3



# 9 ఏళ్లలో సాగునీటికి రూ.లక్ష కోట్లు

- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్య, వ్యవసాయం, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత
- రూ.1.42 లక్షల కోట్ల మూలధన వ్యయంలో రూ.లక్ష కోట్లకు పైగా సాగునీటి రంగానికే...
- తొమ్మిదేళ్లలో విద్యారంగంలో మూలధన వ్యయం కేవలం రూ.2,250 కోట్లు
- వైద్యానికి రూ.6,496 కోట్లు.. గ్రామీణాభివృద్ధికి రూ.11 వేల కోట్లు
- రెవెన్యూ వ్యయంలో విద్య, వ్యవసాయానికే ప్రాధాన్యత... రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఏటా రూ. 9,300 కోట్లు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి తొమ్మిది సంవత్సరాలలో సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.1,14,145 కోట్లు ఖర్చు చేసినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించింది. అందులో మూలధన వ్యయం కింద రూ.1,03,894 కోట్లు, రెవెన్యూ వ్యయం కింద రూ.10,251 కోట్లు వెచ్చించినట్లు తెలిపింది. స్టేట్ ఫైనాన్సెస్ (2022%-%23) పేరుతో రూపొందించిన నివేదికను ఇటీవల జరిగిన అన్ని రాష్ట్రాల ఆర్థిక కార్యదర్శుల సమావేశంలో కాగ్ విడుదల చేసింది. పదేళ్ల విశ్లేషణ పేరుతో 2013–14 నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు దేశంలోని అన్ని - మిగతా2లో

## రైతులను ప్రోత్సహించే పరిశ్రమల ఏర్పాటు



- రూ.3,745 కోట్ల పెట్టుబడి... 1,518 మందికి ఉపాధి
- మూడు కంపెనీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం
- సమావేశంలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొంగులేటి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్

రాష్ట్రంలో రూ.3,745 కోట్ల పెట్టుబడులు పెట్టి 1,518 మంది యువతకు ఉపాధి కల్పించడానికి ముందుకొచ్చిన మూడు కంపెనీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. మంగళవారం సచివాలయంలో పారిశ్రామిక ప్రోత్సాహకాల మంత్రివర్గ ఉపసంఘం సమావేశం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఇందులో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ... "పండ్లతోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించే పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు పెద్దఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయి. జేఎస్‌డబ్ల్యూ యూపీవీ - మిగతా2లో



## త్వరలో వందే భారత్ స్లీపర్!

- రైల్వే మంత్రి క్లారిటీ
- ప్రస్తుతం ఒక రైలు ఢిల్లీలో సిద్ధంగా ఉంది
- మరో రైలు అక్టోబర్ 15 నాటికి సిద్ధమవుతుంది

3

# వారాంతంలోగా నోటిఫికేషన్!

- హైకోర్టు గడువు ముంచుకొస్తుండటంతో సర్కారు నిర్ణయం
- అంతకుముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు జీవో
- ముందు ఎస్ఈసీ షెడ్యూల్.. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్
- రిజర్వేషన్ల ఖరారుకు అర్ధరాత్రి వరకు అధికారుల కసరత్తు
- సీల్డ్ కవర్లలో జిల్లా కలెక్టర్లకు నివేదికలు
- తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని సర్కారు ఆదేశాలు

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ వారాంతంలోగా వెలువడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ నెలా ఖరులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఆలోగానే నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల ఆ ఆదేశాలను పాటించినట్టు అవుతుందని ప్రభుత్వం భావి స్తున్నట్టు సమాచారం. దీనికిముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం జీవో జారీ చేస్తుందని, ఆ వెంటనే ఎన్నికల నిర్వహణ తేదీ ఖరారు చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సమాచారం తెలియజేస్తుందనే చర్చ అధికార వర్గాల్లో జరుగుతోంది. ముందుగా ఎస్ఈసీ షెడ్యూల్ జారీ చేస్తుందని, మరుసటి రోజు నోటిఫికేషన్ విడుదల చేయొచ్చునని చెబుతున్నారు. బీసీలకు - మిగతా2లో



# వారాంతంలోగా నోటిఫికేషన్!

-మొదటిపేజీ తరువాయి

స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 42 శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమ శాఖ లేదా ప్రణాళిక శాఖ జీవో జారీ చేసిన తర్వాత, దీని ఆధారంగా పంచాయతీరాజ్ అధికారులు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వే షన్లపై జీవో జారీ చేస్తారని అంటున్నారు.

**రిజర్వేషన్లు బయటకు పొక్కొద్దు..**

మంగళవారం కల్లా ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీ స్థానాలు, వార్డు స భ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అర్ధరాత్రి దాకా జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దీనికి సంబంధించిన కసరత్తు పూర్తిచేసిన అధికారులు, సిబ్బంది.. ఆ మేరకు నివేదికలను సీల్డ్‌కవర్లలో జిల్లా కలెక్టర్లకు అందజేసినట్టు సమాచారం. ఖరారు చేసిన రిజర్వేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ బయటికి వెల్లడించవద్దని అధికారులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. దీంతో వీటిపై వివరాలు చెప్పడానికి పీఆర్ ఆర్‌డీ అధికారులు, సిబ్బంది నిరాకరిస్తున్నారు. కాగా క్షేత్రస్థాయిలో వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్ల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉండడంతో వీటి ఖరారుకు అధిక సమయం పట్టినట్టు తెలుస్తోంది.

**వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు కూడా..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో జారీ చేశాక...జిల్లాల్లో ఇప్పటికే సిద్ధం చేసిన రిజర్వేషన్ల జాబితాలను పరిశీస్తారు. ఏమైనా మార్పు చేర్పులుంటే సరి చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లకు ఉన్నతాధికారులు సూచించారు. అయితే వీటితో పాటు వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు కూడా పూర్తి చేయాలనే ఆదేశాలతో.. వాటిని కూడా జిల్లా, మండల, గ్రామ అధికారులు పూర్తి చేసినట్టు తెలుస్తోంది. జిల్లా పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ కమిషనర్ ఖరారు చేయాల్సి ఉండగా, అది కూడా పూర్తయినట్టు ప్రచారం జరుగుతోంది.




**రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు...**

ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున.. దీని ద్వారా అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో పూర్తి లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ జెడ్పీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో గెలిచుకునేందుకు వీలుగా ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ వారం లోగా నోటిఫికేషన్ వెలువడితే..మూడు వారాల వ్యవధిలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తిచేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇవి ముగిశాక కొన్నిరోజుల అంతరంతో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆ తర్వాత మూడు వారాల వ్యవధిలోనే ఆ ప్రక్రియ ముగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ నెలాఖరులోగా నోటిఫికేషన్ సాధ్యం కాని పక్షంలో..కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇంతవరకు జరిపిన కసరత్తుకు సంబంధించిన వివరాలు హైకోర్టుకు తెలియజేసి మరింత సమయం కోరే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.


**రిజర్వేషన్లు ఇలా..!**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే..జిల్లా ప్రజా పరిషత్‌లు (జెడ్పీపీలు) 31, జెడ్పీటీసీ స్థానాలు 565 , మండల ప్రజాపరిషత్‌లు 565, ఎంపీటీసీ స్థానాలు 5,763, గ్రామపంచాయతీలు%–% 12,760, వార్డుల సంఖ్య 1,12,534 గా ఖరారు అయ్యాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు 570, ఎంపీటీసీలు 5,817, గ్రామపంచాయతీలు 12,848గా ఉన్నాయి. అయితే ఇప్పుడు 1 జెడ్పీపీ, 5 జెడ్పీటీసీ, 5 ఎంపీపీలు, 54 ఎంపీటీసీ స్థానాలు, 185 గ్రామ పంచాయతీలు తగ్గాయి. మేడ్చల్%–%మల్కాజిగిరిలోని మెజారిటీ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో గ్రామీణ జిల్లా ఉనికి లేకుండా పోయింది. ఒక జెడ్పీపీ, 4 జెడ్పీటీసీల సంఖ్య తగ్గుదలకు ఇది కారణంగా నిలుస్తోంది.

# ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి కేంద్రం ఓకే!

హైదరాబాద్

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం నిర్మాణ విషయంపై స్పష్టత వచ్చింది! రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఈ మార్గాన్నీ నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన అలైన్‌మెంట్‌ను మరోసారి పరిశీలించాలని భావిస్తోంది. ఆ తర్వాత దక్షిణ భాగాన్ని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ (మోర్త్) పరిధిలో చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదే విషయాన్ని తాజాగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఢిల్లీ అధికారులు సీఎం రేవంత్‌కు తెలిపారు. అంటే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని కూడా కేంద్రమే నిర్మించనుంది. ప్రస్తుతం ఉత్తర భాగం నిర్మాణాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో చేపడుతున్నారు. దక్షిణ భాగాన్ని మోర్త్ పరిధిలో చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఖరారు చేసిన 201 కిలోమీటర్ల దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను కేంద్రానికి సమర్పించగా.. తాజాగా మరోసారి పూర్తి వివరాలతో కూడిన అలైన్‌మెంట్‌ను నివేదించనున్నారు. దాన్ని పరిశీలించిన తర్వాత ఈ మార్గాన్ని మోర్త్, ఎన్‌హెచ్ఏఐల్లో దేని పరిధిలో చేపట్టాలనేదానిపై స్పష్టత వస్తుందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని కూడా నిర్మించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసింది. భూముల సేకరణకు సహకరించడంతో పాటు చెల్లించాల్సిన పరిహారంలో రాష్ట్ర వాటాగా 50 శాతం ఇస్తామని తెలిపింది. ఈ క్రమంలోనే కేంద్రం దక్షిణ భాగం రహదారిని నిర్మించేందుకు సమ్మతించినట్లు సమాచారం. అయితే ఈ రహదారి మంజూరైన సమయంలో ప్రాథమిక అలైన్‌మెంట్ ప్రకారం 189 కి.మీ. దూరం ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం 11 కి.మీ. పెరిగి 201 కి.మీ.కు చేరింది. దాని ప్రకారమే రహదారిని నిర్మించాలంటూ కేంద్రాన్ని కోరుతోంది. అంతేకాకుండా ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగానికి అవసరమైన భూములనూ సేకరిస్తే ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని, నిర్మాణ వ్యయంలోనూ మార్పులుండవని తెలిపింది.




**దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఇలా..**

దక్షిణ భాగం కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడు రకాల అలైన్‌మెంట్లను రూపొందించింది. మొదటి ప్రతిపాదన 189.5 కి.మీ., రెండోది 201 కి.మీ., మూడోది 218 కి.మీ.గా ఉంది. మొదటి ప్రతిపాదనలో 96 శాతం వ్యవసాయ భూమి, 3 శాతం నిర్మాణాలు ఉండగా.. మూడో దాంట్లోనూ అంతే ఉన్నాయి. రెండో ప్రతిపాదనలో 99% వ్యవసాయ భూములు, ఒక శాతం నిర్మాణాలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలో అటవీ భూములు లేవు. మొదటి, మూడో ప్రతిపాదనకు వెళితే అటవీ అనుమతులు తీసుకోవాల్సి ఉన్నందున.. రాష్ట్ర మంత్రివర్గం రెండో ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇందులో కేవలం పర్యావరణ అనుమతులు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. రెండో అలైన్‌మెంట్‌లో 2,010 హెక్టార్ల భూమి అవసరం ఉంటుందని, 55 నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుందని తేల్చారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలతోపాటు కొత్త వాటిని అనుసంధానించవచ్చని భావించిన ప్రభుత్వం రెండో అలైన్‌మెంట్‌ను ఆమోదించింది. ఈ మార్గంలో నాలుగు జాతీయ రహదారులు, ఒక రాష్ట్ర రహదారి అనుసంధానం కానుంది. చౌటుప్పల్ దగ్గర ప్రారంభమయ్యే ఈ రోడ్డు ఆమనగల్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా సంగారెడ్డి వరకు మొత్తం 201 కి.మీ. ఉండనుంది. దాదాపు 16 గ్రామాలపై ప్రభావం పడనుంది. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగు రోడ్డు, బెంగళూరు హైవేలన్నీ ఈ మార్గంలోనే అధిక భాగం ఉండడంతో ఈ రోడ్డుపై వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు అధికంగా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. భూ పరిహారం చెల్లింపులు, నిర్మాణం కోసం దాదాపు 16 వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా.

**అలైన్‌మెంట్‌పై వివాదాలిలా..**

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాల్లో భూసేకరణపై, దక్షిణ భాగంలో కొన్ని ప్రాంతాల్లో అలైన్‌మెంట్‌పై కొంత వివాదం జరిగింది. ఉత్తర భాగంలో చౌటుప్పల్ దగ్గర అధికంగా భూములు కోల్పోవాల్సి వస్తోందని, పరిహారం చాలా తక్కువగా ఉందని అక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దక్షిణ భాగం విషయంలోనూ చౌటుప్పల్ నుంచి కొద్దిగా ముందుకువెళ్లిన తర్వాత అలైన్‌మెంట్ మారిందని, కొంతమంది ప్రయోజనం కోసమే అలా చేశారంటూ రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇటీవల దక్షిణ భాగానికి సంబంధించి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత ఆ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి. అలైన్‌మెంట్‌పై ప్రభుత్వం పునరాలోచన చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## 9 ఏళ్లలో సాగునీటికి రూ.లక్ష కోట్లు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు, రెవెన్యూ రాబడులు, ఖర్చులు, రాష్ట్రాల సొంతపన్నుల ఆదాయం, కేంద్రం నుంచి పలు రూపాల్లో అందే సాయం, అప్పులు, చెల్లింపులు, అనివార్యంగా చేయాల్సిన ఖర్చులు ఆ పదేళ్ల కాలంలో ఎలా పెరిగాయి.. అన్ని రాష్ట్రాలు ఎలా ఖర్చు పెట్టాయి.. జీఎస్డీపీలో ఈ రంగాల ఖర్చులు, అప్పుల శాతం ఎంత? ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి అనుగుణంగా ఏ రాష్ట్రాలు ఎలా ఖర్చు చేస్తున్నాయనే అంశాలను విశ్లేషించింది. అయితే, తెలంగాణ రాష్ట్రం 2014%–%15 ఆర్థిక సంవత్సరం నుంచి ఏర్పాటైనందున తొమ్మిదేళ్ల గణాంకాలను అందులో పొందుపరిచారు.

**ఒకటిరెండు రంగాలే..**

కాగ్ నివేదిక ప్రకారం అనేక రంగాల్లో దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడుతూ తొమ్మిదేళ్ల తన ప్రయాణాన్ని కొనసాగించింది. మొదటి తొమ్మిదేళ్లలో సాగునీరు, విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చినట్టు రెవెన్యూ, మూలధన ఖర్చుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. తొమ్మిదేళ్లలో రూ.1.42 లక్షల కోట్లను మూల ధన వ్యయం కింద ఖర్చు పెట్టగా, రూ.లక్ష కోట్లకు పైగా ఒక్క సాగునీటి రంగంలోనే ఆస్తుల కల్పనకు ఖర్చు చేశారు. ఆ తర్వాత రవాణా రంగంలో రూ.20 వేల కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.11 వేల కోట్లు వెచ్చించారు. విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో మాత్రం మూలధన వ్యయం ఆశించిన మేర జరగలేదు. రెవెన్యూ వ్యయం విషయానికి వస్తే.. విద్యకు రూ.1,08,941 కోట్లు, వ్యవసాయా నికి రూ. 1,08,881 కోట్లు వెచ్చించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి తొమ్మిదేళ్లలో రూ.76,440 కోట్లు ఖర్చు చేశారు. మూలధన వ్యయంతో కలిపి ఏడాదికి సగటున రూ.9,300 కోట్లు ఖర్చు చేశారని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇక, తొమ్మిదేళ్లలో మొత్తం బడ్జెటరీ ఖర్చు (రెవెన్యూ, మూల ధన వ్యయం కలిపి) రూ.11,68,401 కోట్లు. అందులో విద్య, వైద్యం, సాగునీరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు రూ.5,34,346 కోట్లు వెచ్చించారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు, పింఛన్లు, అప్పులకు వడ్డీల కింద అనివార్యంగా చేయాల్సిన వాటి కోసం రూ.3,95,941 కోట్లు ఖర్చు పెట్టినట్లు కాగ్ నివేదిక తెలిపింది.

## రైతులను ప్రోత్సహించే పరిశ్రమల ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి

లిమిటెడ్ మహేశ్వరంలో రూ.785 కోట్ల పెట్టుబడితో 364 మందికి ఉపాధి కల్పించేలా కొత్త యూనిట్ ప్రారంభించడానికి ముందుకొచ్చింది. తోషిబా కంపెనీ రూ.562 కోట్ల పెట్టుబడితో 554 మందికి ఉపాధి కల్పించడానికి ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్‌గేర్, బుషింగ్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. హిందుస్థాన్ కోకా కోలా బెవరేజెస్ కంపెనీ రూ.2,398 కోట్ల పెట్టుబడితో 600 మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమను నెలకొల్పుతుంది. ఈ మూడింటికి ఉపసంఘం ఆమోదం తెలిపింది. కోకా కోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ పంటలకు డిమాండ్ ఏర్పడి రాష్ట్ర రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుంది" అని చెప్పారు. వివిధ దేశాల నుంచి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన కంపెనీలు.. ఒప్పందాలు, విధి విధానాలపై మంత్రులు సమీక్షించారు.

## మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి



-మొదటిపేజీ తరువాయి

కేటాయించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నుంచి గెలిచిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. పోరాటానికి, పౌరుషానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తిగా నిలుస్తారని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి తల్లులను దర్శించుకుంటున్నానని తెలిపారు. 2023 ఫిబ్రవరి 6న మేడారం సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదం తీసుకుని ఇక్కడి నుంచే పాదయాత్రకు పూనుకున్నానని, దొరల పాలన నుంచి ప్రజాపాలన తీసుకవస్తామని ప్రకటించానని తెలిపారు. ఆ తల్లుల దీవెనలతో ప్రజలు ఆశీర్వదించారని, నేడు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు.

**గద్దెల పునఃనిర్మాణం గొప్ప అవకాశం..**

సమ్మక్క, సారలమ్మ గద్దెల, ప్రాంగణ అభివృద్ధి పునఃనిర్మాణ కార్యక్రమం తనకు, మంత్రి సీతక్కకు ఈ జన్మలో లభించిన గొప్ప అవకాశమని సీఎం రేవంత్ అన్నారు. ఇది బాధ్యత కాదని, బాధ్యతతో కూడిన భావోద్వేగమని చెప్పారు. ఈ ఆలయ అభివృద్ధికి తాము ఎన్ని కోట్లయినా ఖర్చుపెడతామన్నారు. ప్రకృతి దేవతల చరిత్ర రాబోయే వందల, వేల ఏళ్లు నిలిచి ఉండేలా గద్దెలు, ప్రాంగణం పునఃనిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. గిరిజనులు, ఆదివాసీల సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలని ఆలోచనతో పూజారులు, అదివాసీల అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడకు వచ్చానని అన్నారు. ఆదివాసీల సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా పునఃనిర్మాణ పనులు జరపాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. అందుకే అభివృద్ధి పనుల్లో ఆదివాసీలనూ భాగస్వాములను చేస్తామన్నారు. సిమెంట్‌తో కట్టిన ఏ కట్టడమైనా వందేళ్ల జీవితకాలమే ఉంటుందని, రాతితో నిర్మిస్తే వందల, వేల ఏళ్ల జీవితకాలం ఉంటుందని సీఎం తెలిపారు. అందుకే సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ప్రాంగణాన్ని రాతితో నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ పనులను వచ్చే ఏడాది జాతర ప్రారంభానికి ముందే వంద రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఆలయంతో పాటు జంపన్నవాగు, రహదారుల నిర్మాణం కూడా పూర్తి చేస్తామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ వీడియోను సభా వేదికపై ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. మాస్టర్‌ప్లాన్‌కు సభికుల నుంచి ఆమోదం తీసుకున్నారు.

**ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..**

అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమని సీఎం రేవంత్ అన్నారు. ముఖ్యంగా ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలు, గిరిజనుల ప్రాంతాలను అభివృద్ధిలో ముందుకు నడిపించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేశామని చెప్పారు.

**ఒకే వరుసలో గద్దెలు.. గ్రానైట్‌తో సుందరీకరణ**

మేడారంలో ప్రస్తుతం ఉన్న దేవతల గద్దెలను ఒకే వరుసలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో నిర్మించనున్నారు. సమ్మక్క, సారలమ్మ పాత గద్దెలను ముట్టుకోకుండానే చుట్టూ గ్రానైట్‌తో సుందరీకరించనున్నారు. అలాగే సారలమ్మ గద్దె తరువాత వరుస క్రమంలో పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను కొత్తగా నిర్మించనున్నారు. ప్రస్తుతం గద్దెల ప్రాంగణంలో ఉన్న చెట్లతోపాటు ఏ కట్టడాన్నీ కూల్చకుండా సాలారాన్ని నాలుగు వైపులా 20 అడుగుల చొప్పున విస్తరించేలా రూపకల్పన చేశారు. నాలుగు ప్రవేశ ద్వారాలతో పాటు మరో నాలుగు బయటకు వెళ్లే ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు.

# 11 రాష్ట్రాలు విపరీత అప్పులు

**న్యూఢిల్లీ :** దేశంలో రెవెన్యూ మిగులు రాష్ట్రాలు, అలాగే రెవెన్యూ లోటు రాష్ట్రాలపై కాగ్ ఆడిట్ నిర్వహించింది. కాగ్ ఆడిట్ ప్రకారం, 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ మిగులు రాష్ట్రాల్లో తెలంగాణ ఉండగా, రెవెన్యూ లోటు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉంది. మార్చి 2023 నాటికి దేశంలోని 28 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలు రెవెన్యూ మిగులులో ఉండగా, మిగిలిన 12 రాష్ట్రాలు మాత్రం రెవెన్యూ లోటులో ఉన్నాయని కాగ్ ప్రకటించింది. రెవెన్యూ మిగులు ఉన్న 16 రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ రూ. 37 వేల 263 కోట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. గుజరాత్, ఒడిశా తదితర రాష్ట్రాలు తరువాత స్థానాల్లో ఉన్నాయి. అంటే 16 రాష్ట్రాల్లో మాత్రమే వ్యయానికి మించిన ఆదాయం సమకూరింది.
పదేళ్లలో దేశం ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడోస్థానంలో నిలవడమే తమ లక్ష్యం అని బీజేపీ నేతలు పదే పదే చెప్పుకుంటున్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలోనూ దీనిని ప్రధానంగా పేర్కొన్నారు. 5 స్థానానికి వచ్చింది నిజమే కానీ, మూడోస్థానం అంత ఈజీ కాదు. ఇక ఆర్థికంగా ఎదిగినా.. అప్పుల్లో కూడా గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. కాగ్ తాజా నివేదిక ప్రకారం, 2013?14 నుంచి 2022?23 వరకు 28 రాష్ట్రాల మొత్తం ప్రభుత్వ రుణం 17.57 లక్షల కోట్ల నుండి 59.60 లక్షల కోట్లకు చేరింది, అంటే 3.3 రెట్లు పెరిగింది. ఈ పరిణామం రాష్ట్రాల ఆర్థిక ఉత్పాదకతను బలహీనపరుస్తూ, స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రుణ శాతం 16.66 నుంచి 23 శాతానికి పెరిగింది. ఇది దేశ జీడీపీలో 22.17 శాతానికి సమానమైన 268.9 లక్షల కోట్ల భారాన్ని సృష్టించింది. ఈ ట్రెండ్ ఆర్థిక వృద్ధి మూలాలను దెబ్బతీస్తూ, భవిష్యత్ పెట్టుబడులకు అడ్డంకిగా మారుతోంది.రుణ స్థాయిలు రాష్ట్రాల మధ్య విస్తృతంగా మారుతున్నాయి. 2023 చివరి నాటికి, పంజాబ్ 40.35 శాతం జీఎస్‌డీపీతో అత్యధికం, నాగాలాండ్ 37.15 శాతం, పశ్చిమ బెంగాల్ 33.70 శాతంతో వచ్చాయి. ఇక బీజేపీ పాలిత గుజరాత్ 16.37 శాతం, మహారాష్ట్ర 14.64 శాతం రుణాలు నమోదయ్యాయి, అయితే ఒడిశా 8.45 శాతంతో తక్కువ రుణాలు తీసుకుంది. మొత్తంగా, ఎనిమిది రాష్ట్రాలు 30 శాతం మించిన రుణాలతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ వైవిధ్యం పాలనా విధానాలు, ఆదాయ వనరుల పంపిణీలోని అసమానతలను ప్రతిబింబిస్తుంది.ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ, బీహార్, తమిళనాడు సహా 11 రాష్ట్రాలు 2023లో ఆర్థిక నిబంధనలు ఉల్లంఘించి రోజువారీ ఖర్చులకు కూడా రుణాలు సేకరించాయి. రుణాలు




పెట్టుబడులకు మాత్రమే పరిమితం కావాలి, కానీ ఈ రాష్ట్రాలు బాండ్లు, ట్రెజరీ బిల్లులు, బ్యాంకు రుణాలు, ఆర్‌బీఐ వెయ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఎల్ఐసీ, నాబార్డ్ వంటి మార్గాల ద్వారా దీన్ని చేశాయి. ఇది రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని హరించాయి. దీర్ఘకాలిక స్థిరత్వానికి ముప్పుగా మారింది.కాగ్ నివేదిక మోడీ పాలనా దశలో రాష్ట్రాల రుణాల భారాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఆర్థిక సమతుల్యత లోపాన్ని సూచిస్తుంది. ఈ పరిణామాలు కేంద్ర?రాష్ట్ర సంబంధాల్లోని ఒత్తిడిని, ఆదాయ పంపిణీలోని సమస్యలను గుర్తుచేస్తాయి. రుణ నిర్వహణపై దృష్టి సారించకపోతే, దేశ ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉంది. యూపీ తొలి స్థానంలో ఉండగా, గుజరాత్ రూ. 19 వేల 865 కోట్లు, ఒడిశా రూ. 19 వేల 456 కోట్లు, ఝార్ఖండ్ రూ. 13 వేల 564 కోట్లు, కర్ణాటక రూ. 13 వేల 494 కోట్లు రెవెన్యూ మిగులుతో టాప్ 5లో నిలిచాయి. ఛత్తీస్‌గఢ్ రూ.8,592 కోట్లుతో 6వ స్థానం, తెలంగాణ రూ. 5,944 కోట్ల రెవెన్యూ మిగులుతో 7వ స్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్ రూ.5,310 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.4,091 కోట్లు, గోవా రూ.2,399 కోట్లు రెవెన్యూ మిగులుతో టాప్ 10లో ఉన్నాయి.ఇదే సమయంలో 12 రాష్ట్రాలలో రెవెన్యూ లోటు ఉందని కాగ్ పేర్కొంది. ఆ రెవెన్యూ లోటు మొత్తం రూ. 2,22,648 కోట్లుగా ఉంది. ఈ రాష్ట్రాల్లో ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంది. 2022-23లో రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు 14వ ఆర్థిక సంఘం రూ. 86,201 కోట్లు విడుదల చేసింది. ఇది మొత్తం లోటులో 39 శాతంగా ఉంది. బిహార్, కేరళ, మేఘాలయ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో తమ రెవెన్యూ వ్యయంపై 90 నుండి 100 శాతం వరకు రాబడి అందుకున్నాయి. 2022-23లో రెవెన్యూ లోటు గ్రాంట్లు, ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ఇచ్చే మొత్తం గ్రాంట్లలో 50 శాతంగా ఉన్నాయి. రాజస్థాన్, అస్సాం, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో రెవెన్యూ ఆదాయం 80 నుండి 90 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ లలో రెవెన్యూ ఆదాయం 75 నుంచి 80 శాతం వరకు ఉంది. అత్యధికంగా రెవెన్యూ లోటు పశ్చిమ బెంగాల్ (15.76 శాతం) కలిగి ఉంది, తరువాత స్థానాల్లో కేరళ 15.28 శాతం, ఆంధ్రప్రదేశ్ 12.24 శాతం, హిమాచల్‌ప్రదేశ్ 10.88 శాతం వంటి రాష్ట్రాలు ఉన్నాయి. 10 రాష్ట్రాలు ఆర్థిక సంఘం మొత్తం గ్రాంట్లలో 94 శాతం పొందాయి. ఆరోగ్య, పంచాయతీ రాజ్, పట్టణ సంస్థలు, విపత్తు ప్రతిస్పందన నిధి వంటి విభాగాలకు రెవెన్యూ లోటు గ్రాంటు నుండి మంజూరు చేసిన మొత్తం రూ. 1,72,849 కోట్లు. 50 శాతం రెవెన్యూ గ్రాంట్ ఉండగా, అధికంగా పంచాయతీ రాజ్ శాఖకు 26 శాతం, పట్టణ స్థానిక సంస్థలకు 11 శాతం, విపత్తు నిధికి 10 శాతం గ్రాంటును కేంద్ర ప్రభుత్వం అందించింది.


# బెంగళూరులో డిపాజిట్ భారం

బెంగళూరు : భారతదేశ ఐటీ రాజధానిగా పేరొందిన బెంగళూరు, సిలికాన్ సిటీగా ఖ్యాతి గడించింది. ఇక్కడి ఇంటి అద్దెలు సామాన్యులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. జీతంలో అత్యధికంగా ఇంటి అద్దెకే చెల్లించాల్సి వస్తోంది. అడ్వాన్స్ డిపాజిట్ డిమాండ్‌లు జనసామాన్యాన్ని, ముఖ్యంగా ఐటీ ఉద్యోగులను కలవరపెడుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోందిఇటీవల రెడిట్‌లో ఓ వినియోగదారు బెంగళూరులోని పణత్తూరు ప్రాంతంలో ఒక ఫ్లాట్‌కు నెలకు రూ.70 వేల అద్దె, రూ.5 లక్షల డిపాజిట్ అడుగుతున్నారని పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ ఐటీ ఉద్యోగులు, స్థానికుల మధ్య భారీ చర్చకు దారితీసింది. ట్రాఫిక్ సమస్యలు, వర్షంతో నీటితో నిండిపోయే రోడ్ల మధ్య ఇంత భారీ అద్దె డిమాండ్ చేయడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరు 'ఇంత అద్దె భారం ఉంటే జీవనం ఎలా సాగించగలం?' అని ప్రశ్నించగా, మరొకరు చమత్కారంగా 'కార్యాలయానికి దగ్గరగా ఉంటే చిన్న గదికైనా భారీ అద్దె చెల్లిస్తారు, కానీ ట్రాఫిక్‌లో చిక్కుకుంటారు' అని వ్యాఖ్యానించారు. ఇక పణత్తూరులో సగటు అద్దె రూ.41 వేలు ఉండగా, రూ.70 వేల అని పేర్కొనడంపై స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు.

అద్దెల పెరుగుదలకు కారణాలు

బెంగళూరులో ఇంటి అద్దెలు గతంలో ముంబై, ఢిల్లీలతో పోలిస్తే సాపేక్షంగా తక్కువగా ఉండేవి. అయితే, కొవిడ్?19 మహమ్మారి తర్వాత పరిస్థితులు గణనీయంగా మారాయి. ఈ అద్దెల పెరుగుదలకు కొన్ని కీలక కారణాలు ఉన్నాయి.

? కోవిడ్ తర్వాత ఐటీ సంస్థలు కార్యాలయాలకు తిరిగి రావాలని ఉద్యోగులను కోరడంతో, బెంగళూరుకు తిరిగి వచ్చే ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఇది గృహాల



డిమాండ్‌ను పెంచింది.

? ఇళ్ల నిర్మాణం తగ్గడంతో సరఫరా డిమాండ్‌కు సరిపడటం లేదు, ఫలితంగా అద్దెలు పెరిగాయి.

? రద్దీగా ఉండే రోడ్లు, ట్రాఫిక్ సమస్యల కారణంగా ఉద్యోగులు కార్యాలయాలకు సమీపంలో ఉండేందుకు ఎక్కువ అద్దెలు చెల్లించడానికి సిద్ధపడుతున్నారు.

? స్థానికుల అభిప్రాయం ప్రకారం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అద్దెలు పెరుగుతాయని, ఇది సహజమైన ఆర్థిక ఒడిదుడుకుల ఫలితమని చెబుతున్నారు.

మల్లేశ్వరం వంటి ప్రాంతాల్లో ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లకు రూ.లక్షకు పైగా అద్దె ఉండగా, 11 నెలల డిపాజిట్ వసూలు సాధారణమైంది. ఇంటిని ఖాళీ చేసేటప్పుడు రిపేర్, పెయింటింగ్ ఖర్చుల పేరుతో డిపాజిట్‌లోంచి ఒక నెల అద్దె మొత్తాన్ని కోతపెట్టడం సర్వసాధారణంగా మారింది. ఇది అద్దెదారులకు అదనపు ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. బెంగళూరు ఐటీ రాజధానిగా ఉండటం వల్ల ఆర్థిక అవకాశాలు ఎన్నో అందిస్తున్నప్పటికీ, ఇంటి అద్దెల భారం సామాన్యులకు, ఐటీ ఉద్యోగులకు సవాలుగా మారింది. సోషల్ మీడియా చర్చలు ఈ సమస్య యొక్క తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.

## త్వరలో వందే భారత్ స్లీపర్..!

వందే భారత్ స్లీపర్ సర్వీసులకు సంబంధించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఒక రైలు దిల్లీలో సిద్ధంగా ఉందని, మరో రైలు అక్టోబర్ 15 నాటికి సిద్ధమవుతుందన్నారు. అది వచ్చిన వెంటనే రెండు కలిపి ప్రారంభిస్తామన్నారు. దిల్లీలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. రైల్వే శాఖ గత పదేళ్లలో చేపట్టిన పలు కీలక ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. ఇక వందే భారత్ స్లీపర్ విషయానికొస్తే.. రెగ్యులర్ సర్వీసులు కొనసాగించాలంటే కనీసం రెండు రైళ్లు అవసరమని, అందుకే మరో దానికోసం వేచి చూస్తున్నామన్నారు. ఆ తర్వాతే ఏ మార్గంలో నడపాలనేది నిర్ణయిస్తామన్నారు. అయితే, బిహార్‌లో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు దిల్లీ నుంచి పట్నా మధ్య ప్రారంభించే అవకాశం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.



## హెచ్-1బీ 'లాటరీ' విధానంలో మార్పులు!




హెచ్-1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచిన అమెరికా ప్రభుత్వం.. వీటికి సంబంధించి కొత్త నిబంధనలు తీసుకువచ్చే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధిక నైపుణ్యం ఉన్న, ఉత్తమ వేతనాలు పొందే నిపుణుల ఎంపిక కోసం తాజా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న లాటరీ విధానంలో కీలక మార్పులు తెచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. హెచ్-1బీ వీసా ఎంపిక ప్రక్రియలో ఈ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలను ఫెడరల్ రిజిస్ట్రార్ తాజాగా విడుదల చేసింది. తాజా ప్రతిపాదనల ప్రకారం.. హెచ్-1బీ కోసం ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ కొత్త నిబంధనలను వచ్చే ఏడాది నుంచి అమలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇవి అమల్లోకి వస్తే హెచ్-1బీ ఉద్యోగులకు చెల్లించే మొత్తం వేతనాలు 2026 ఆర్థిక సంవత్సరంలో 502 మిలియన్ డాలర్లకు పెరుగుతాయని డీహెచ్ఎస్ అంచనా వేసింది. 2027లో 1 బిలియన్ డాలర్లు, 2028లో 1.5బి.డాలర్లు, 2029లో 2 బి.డాలర్లు పెరిగే అవకాశం ఉందని లెక్క కట్టింది.

## ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపాను



వాషింగ్టన్

ఐక్యరాజ్యసమితి సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. అమెరికా అధ్యక్షుడిగా కేవలం ఏడు నెలల కాలంలో ఏడు యుద్ధాలు ఆపాను. అందుకే తన పరిపాలన స్వర్ణయుగం అంటూ అభివర్ణించారు. అమెరికా న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి 80వ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించారు. 'ఇజ్రాయెల్ - ఇరాన్, భారత్-పాకిస్థాన్, రువాండా - డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, థాయిలాండ్-కంబోడియా, అర్మేనియా -అజర్‌బైజాన్, ఈజిప్ట్ - ఇథియోపియా, సెర్బియా -కొసావో దేశాల మధ్య అంతులేని యుద్ధాల్ని ముగించా. కొన్ని యుద్ధాలు 31 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. మరికొన్ని 36ఏళ్లుగా కొనసాగుతున్నాయి. అలాంటి అంతులేని యుద్ధాల్లో నేను ఏడు యుద్ధాలు ఆపాను. మరే ఇతర అధ్యక్షుడు వాటిని ఆపే ప్రయత్నం చేయలేదు. కానీ నేను వాటిని ఆపాను. భారత్-పాక్ యుద్ధాన్ని కూడా నేనే ఆపా. ప్రపంచ దేశాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్నా. ప్రజల ప్రాణాలు కాపాడటమే నాకు అసలైన నోబెల్ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితిపై విమర్శలు గుప్పించారు. యుద్ధాలు ఆపడంలో ఐక్యరాజ్యసమితి ఘోరంగా విఫలమైంది. ఐక్యరాజ్యసమితి తన ప్రాముఖ్యతను కోల్పోయింది. దేశాల మధ్య యుద్ధ సమస్యల్ని పరిష్కరించేలా సహాయం చేసేందుకు ప్రయత్నించలేదు. ఐక్యరాజ్యసమితి తన సామర్థ్యాన్ని కోల్పోయింది. ఐక్యరాజ్య సమితివన్నీ ఒట్టి మాటలే. ఆ ఒట్టి మాటలు యుద్ధాల్ని ఆపలేవు' అని ట్రంప్ అన్నారు.

## దండకారణ్యానికి భారీగా బలగాలు

న్యూఢిల్లీ

మధ్యభారతంలో మావోయిస్టుల అంతమే లక్ష్యంగా విరుచుకుపడుతున్న కేంద్ర బలగాలు నిర్ణయాత్మక దాడులకు సిద్ధమవుతున్నాయి. నక్సల్స్ కదలికలు ఉన్న ఛత్తీసగఢ్, జార?ండ్, ఒడిశా, మహారాష్ట్రలకు మరిన్ని బలగాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా అమర్‌నాథ్ యాత్ర కోసం జమ్మూకశ్మీర్‌లో నియమించిన కేంద్ర పోలీస్ సాయుధ బలగాల్లో (సీఏపీఎఫ్) ఇంకా అక్కడే ఉండిపోయిన వారిలో 80% మేర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు తరలించనున్నారు. ఈ విషయాన్ని సీఏపీఎఫలోని సీనియర్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. మావోయిస్టు నాయకత్వాన్ని భౌతికంగా బలహీనపరచడం...ఇప్పటికీ వారి చేతుల్లోని ప్రాంతాలను ఒక్కొక్కటిగా స్వాధీనంలోకి తెచ్చుకోవడం లక్ష్యంగా అదనపు బలగాలను కేటాయిస్తున్నట్టు తెలిపాయి. రాబోయే కొన్ని వారాల్లో అవి ఎర్ర బీభత్స ప్రాంతాలకు (రెడ్‌జోన్) చేరుకుంటాయని తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల రహిత భారత్‌ను నిర్మిస్తామని ఇప్పటికే కేంద్ర హోంశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకుగాను కేంద్ర కమిటీ సభ్యులపై గురిపెట్టి కేంద్ర బలగాలు దాడులు సాగిస్తున్నాయి. తాజాగా ఒకే ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి (రాజుదాదా), కడారి సత్యనారాయణరెడ్డి (కోసా) మృతిచెందారు. ఈ ఏడాదిలో దాదాపు ఎనిమిదిమంది సీసీ సభ్యులను ఎన్‌కౌంటర్ చేశారు. ఒక సీసీ మెంబరు లొంగిపోయారు. నాయకుల్లో అధిక భాగం ఛత్తీసగఢ్, జార?ండ్, ఒడిశాల్లో తలదాచుకున్నట్టు కేంద్ర హోంశాఖ వద్ద సమాచారం ఉంది. ఈక్రమంలో ఈ మూడు రాష్ట్రాలపైనే దృష్టి పెట్టి.. అదనపు బలగాలను అక్కడకు అధికంగా తరలించాలని నిర్ణయించింది. మావోయిస్టులు చేస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర బలగాలు తిరస్కరించాయి. బలగాల దృష్టిని మళ్లించడం కోసం ఒక ఎత్తుగడగా ఈ ప్రతిపాదన చేస్తున్నారని పెదవి విరిశాయి. ఇటువంటి ప్రతిపాదనలతో మావోయిస్టులు ముందుకురావడం కొత్తకాదని, వాటికి పెద్దగా సాధికారికత కూడా లేదని కేంద్ర హోంశాఖలోని సీనియర్ అధికార వర్గాలు తెలిపాయి. సీనియర్ నాయకులు చనిపోతుండటంతో ఇప్పటికే ఆత్మరక్షణలో పడిపోయిన మావోయిస్టులు ఇలాంటి ఎత్తుగడలు పన్నుతున్నారని ఈ వర్గాలు తెలిపాయి. దండకారణ్య కమిటీ, కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన నాయకుల పని కూడా పడతామని స్పష్టం చేశాయి.

# జనం మెచ్చిన నాయకుడు, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నాయకుడు పట్నం మహేందర్ రెడ్డి




పట్నం మహేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శేరి సతీష్ రెడ్డి

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23 (ప్రభాత సూర్య) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, శాసనమండలి సభ్యుడు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకుడు శేరి సతీష్ రెడ్డి, దేశాల్ (గొట్టిముక్కల జస్వంత్ రావు) మిత్రమండలి ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి మహేందర్ రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకే అందించి, శాలువాతో ఘన సన్మానం చేశారు. అనంతరం మాట్లాడిన సతీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం, పార్టీ కార్యకర్తల అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తారని అభిప్రాయపడ్డారు. పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, ప్రజా సేవలో మరింత చురుకుగా వ్యవహరించాలని మహేందర్ రెడ్డి పట్ల ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల జస్వంత్ రావు, భీమ్రావు, కంటెస్టూడి ఎమ్మెల్యే సంజీవరావు, మేకల మైకల్, పులి శ్రీకాంత్ పటేల్, పులి శివ గౌడ్, అబ్దుల్ బాకీ, మస్తాన్ రెడ్డి, డివిజన అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్ పుత్, ఏఎంసీ డైరెక్టర్ పనింద్ర కుమార్, రాజేష్ గౌడ్, క్రిస్టఫర్, జున్ను పాషా, భాష, అశోక్ ముదిరాజ్, పొడుగు అప్పారావు, కొమ్ము బాబు, మనోజ్, మహిళా నాయకురాలు వనజ, యమునా, వాణి, అభిమానులు పాల్గొని నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కళ్యాణి నగర్ వరద ముంపు ప్రాంతాలలో పర్యటించిన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కళ్యాణినగర్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభ్యం

కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్ రెడ్డి




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23 (క్రైమ్ మిర్రర్) :** కళ్యాణినగర్ కాలనీకి వరద నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడం జరిగిందని, ఈ నేపథ్యంలోనే జిహెచ్ఎంసి, హైడ్రా అధికార యంత్రాంగం అతి త్వరలో రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించడం జరుగుతుందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డితో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో కళ్యాణినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కళ్యాణినగర్ ను అనుకుని ఉన్న జీడిమెట్ల పెద్ద నాలా ప్రవాహాన్ని పరిశీలించారు. స్థానికులు వర్షం వచ్చినప్పుడు వరద నీటితో కాలనీ ముంపునకు గురయ్యే తీరును జోనల్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ కళ్యాణినగర్ కాలనీ ముంపు సమస్యను గతంలో పరిశీలించడం జరిగిందని, ఆనాడే స్థానిక ప్రజల సమస్యలను పరిష్కారానికి నడుం బిగించి అప్పుడే జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కు ఫోన్ చేసి చెప్పడం జరిగిందని, నాలా కు మధ్యలో ఒక బ్రిడ్జిని నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించడం జరిగిందని గుర్తుచేశారు. బండి రమేష్ ఆదేశాల మేరకే ఈ రోజు కళ్యాణినగర్ కాలనీలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ పర్యటించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి నగర్ అసోసియేషన్ సభ్యులు, మైనారిటీ నాయకుడు ముక్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఆ రాత్రి కార్పొరేటర్ ఎక్కడికి వెళ్ళాడు..!? స్థానిక బాలానగర్ కార్పొరేటర్ అసమర్థత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు కళ్యాణినగర్ వరదల్లో ముంపుకు గురైతే అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన కష్ట సుఖాల్లో ఉండాలనే ఒక మంచి ఉద్దేశంతో ఆ రోజు అర్ధరాత్రి అనకుండా వెళ్ళి నీళ్లలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. ఆ రాత్రి కార్పొరేటర్ ఎక్కడకు పోయాడు.? రాత్రి సమయంలో వరద నీటిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, బాధలు పడుతున్న ప్రజల కష్టాలు తెలుసుకోలేని కార్పొరేటర్ ఉండి ఎందుకు ?లేక ఎందుకు.? ప్రజల కష్టాలు పట్టించుకొని కార్పొరేటర్ ఉండి దండగ.!

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

కలెక్టరేట్లో ఘనంగా రెండవ రోజు బతుకమ్మ పండుగ సంబరాలు.



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 23:** తెలంగాణ మహిళల సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక గా నిలుస్తుంది అని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో జిల్లా విద్యాశాఖ , ఇంటర్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ ల ఆధ్వర్యంలో రెండవ రోజు బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ తెలంగాణ మహిళల ఆత్మీయత, ఆధ్యాత్మికత, సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక గా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని దైవంగా పూజించె పండుగగా బతుకమ్మ పండుగ అన్నారు. ఇలాంటి పండుగలను నిర్వహించడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలుపవచ్చు అన్నారు. భావి తరాల కు చెందిన పిల్లలకు సంస్కృతి , సాంప్రదాయాలతో పాటు విలువలను కూడా తెలపడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ,మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి , పాటలు పాడి బతుకమ్మ పండుగ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు ఉద్యోగులు విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డి ఐ ఈ ఓ గోవింద్ రామ్ , ఉపాధ్యాయులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తంగేడిపల్లి ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం

-డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ యశోద

-పిఓ ఎన్సిడి డాక్టర్ సుమన్ కళ్యాణ్

-మండల వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు




**చౌటుప్పల్. సెప్టెంబర్ 23. ప్రభాత సూర్య :** మహిళలు, పిల్లలు, వృద్ధులు ఆరోగ్యం పై దృష్టి సారించి, ప్రధాని నరేంద్ర మోడీ తన 75వ పుట్టినరోజు సందర్భంగా " స్వస్త్ నారీ,సశక్త్ పరివార్ అభియాన్ " 8వ రాష్ట్రీయ పోషణ్ మహ్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా మెడికల్ క్యాంపులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మండలం తంగేడుపల్లి ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లలకు, వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు వంటి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేసి పలు ఆరోగ్య సూచనలను చేశారు. ఈ మెడికల్ క్యాంపులను జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించినట్లు దీనిలో భాగంగానే చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామ పిహెచ్సిలో నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు తెలిపారు. ఆశ వర్కర్ల సహాయంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీలు, పిల్లలు,వృద్ధులకు వైద్య పరీక్షల అవసరమైన వారిని గుర్తించి ప్రత్యేకంగా వారికి వైద్య పరీక్షలు అందజేసినట్లు తెలిపారు. వచ్చేనెల అక్టోబర్ 1న తంగడపల్లి పిహెచ్సిలో వైద్య నిపుణులచే ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించబడుతుందని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దేశంలో మహిళలు, పిల్లల కోసం చేపట్టిన అతిపెద్ద



ఆరోగ్య కార్యక్రమాలలో ఇది ఒకటని డాక్టర్ కాటమరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ యశోద, పిఓ ఎన్సీడీ డాక్టర్ సుమన్ కళ్యాణ్, మండల వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు, డాక్టర్ అలివేలు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ సృజన, డాక్టర్ శ్రీదేవి, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశ వర్కర్లు, సూపర్వైజర్లు, లింగస్వామి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లమల్ల కృష్ణారెడ్డి



**సంస్థాన్ నారాయణపూర, సెప్టెంబర్ 23( ప్రభాత సూర్య):** కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైకని నరేందర్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదం తో తీవ్ర గాయాల పాలయ్యారు. విషయాని గమనించి చలమల్ల కృష్ణారెడ్డి 20,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడంతో కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాసమల్ల యాదయ్య, సినియర్ నాయకులు చిలివేరు నరసింహ, చెక్క నర్సింహ మాజీ ఉపసర్పంచ్ మైలారం రాములు, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు అందే నరేష్ యాదవ్, చింతల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో బతుకమ్మ మరియు దసరా ఉత్సవాలు...




**మాదాపూర్ ప్రభాత సూర్య :** శిల్పారామం మాదాపూర్ లో నవరాత్రి, బతుకమ్మ మరియు దసరా సెలెబ్రేషన్స్ అండ్ సారీస్ అఫ్ ఇండియా మేళ ను నిర్వహిస్తున్నారు. బనారస్, చెందేరి, కోట, గుజరాతీ, ఉప్పాడ, బనారస్, కాశ్మీరీ, మొదలైన చీరలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. మంగళవారం ఒడిసి మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. శ్రీమతి దేబస్రి పట్నాయక్ బృందం ఒడిసి నృత్యం లో నవదుర్గ, స్థాయి, జనసమ్మోహినీ మొదలైన అంశాలను నీలాంజన, అనన్య, స్వాతి, సోనాలి, యుక్తి నందు మొదలైన వారు ప్రదర్శించారు. శ్రీమతి దుర్గేష్ నందినిగారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు గణేశా పంచరత్న , జయము జయము, శారదా భుజంగం, హంసానందిని తిల్లాన, కామాక్షి స్తుతి, దశావతరం అంశాలను కళాకారులూ గాయత్రీ,ఫణి, సూరజ్ , షణ్ముఖి, సంయుక్త, అంజనీ, జయ , దివ్య మొదలైన వారు ప్రదర్శించారు. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మ ను పేర్చి మెయిన్ లాన్ లో ఆడుకున్నారు.

## లక్కారం చెరువు కట్టమైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు

చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షులు బడుగు లక్ష్మయ్య

మున్సిపల్ అధ్యక్షులు సుంకరి జంగయ్య గౌడ్




**చౌటుప్పల్. సెప్టెంబర్ 23. ప్రభాత సూర్య :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం చెరువు, కైతాపురం చెరువులు ఆశాజనకంగా నిండి ఆలుగు ద్వారా వస్తున్న వరద నీరు లక్కారం చెరువులోకి రావడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షులు బడుగు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్, మండల పార్టీ అధికార ప్రతినిధి పాశం రఘుపతి ముదిరాజ్, చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు సుంకరి జంగయ్య గౌడ్ , జిల్లా నాయకులు యాట వెంకటేశం లు మంగళవారం లక్కారం చెరువును సందర్శించి చెరువుకట్టపై వెలసిన కట్ట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు లక్ష్మయ్య మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఆనాటి పంచాయత్ రాజ్ మంత్రివర్యులు ఎలిమినేటి మాధవరెడ్డి సహకారంతో లక్కారం కాలువ నిర్మాణమును మల్కాపురం తెప్పలచెరువు నుండి శేషరాశి కుంట, మల్కాపురం, కైతాపురం, లక్కారం చౌటుప్పల గ్రామాల చెరువులోకి నీళ్ల మళ్లింపు కోసం నిధులు వెచ్చించి నిర్మాణం చేయించడం జరిగిందని గుర్తు చేశారు. ఇక్కడి ప్రజల యొక్క కల మాధవ రెడ్డితో తీరినదని అన్నారు. కానీ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఈ కాలువకు అడ్డంకు కలిగించి నీళ్లు రాకుండా చేయడం జరిగిందని దీని గురించి ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. మండలంలోని చెరువులలో నీరు చేరడంతో ప్రజలు ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. లక్కారం కట్ట మైసమ్మ అమ్మవారి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## ఉపాధి హామీ నర్సరీలను సందర్శించిన డిఆర్డిఎ పిడి



**మర్రిగూడ సెప్టెంబర్ 23 ప్రభాత సూర్య:** మరిగూడ మండలంలో లెంకలపల్లి శివన్నగూడెం గ్రామాలలో పిడి శేఖర్ రెడ్డి ఉపాధి హామీ నర్సరీలు సందర్శించారు శివన్న గూడెం గ్రామ పంచాయతీలోని రికార్డులను ఆయన తనిఖీ చేశారు అధికారులకు తగిన సూచనలు తెలియజేశారు శ్రీనిధి రుణాలు వికలాంగుల నూతన సంఘాల ఏర్పాటు పై సమీక్షించారు ఏపీ ఓ జయరాజు,ఏపీఎం వెంకట్,ఈసీ వివేక్, గ్రామ ప్రజలు ఫీల్డ్ అసిస్టెంట్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కార్యకర్తలకు అండగా ఉంటాం





మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**తుర్కయంజాల్,సెప్టెంబర్ 23, ప్రభాత సూర్య:** బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, వారిని కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొక్క మురళీధర్ రెడ్డిని కిషన్‌రెడ్డి పరామర్శించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారన్న నెపంతో మురళీధర్ రెడ్డిపై స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి అక్రమ కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఏకంగా దేశం ద్రోహం కేసులు పెట్టి జైలుకు పంపే కుట్రలు చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రజలు బయటికి వచ్చి తిరగబడటం ఖాయమని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అనేకమంది బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టారని అన్నారు. స్వయంగా స్థానిక ఎమ్మెల్యే పోలీసులకు ఫోన్లు చేసి, బెదిరించి కేసులు పెట్టిస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. అధికారులు, పోలీసులు తమ వృత్తికి లోబడి పనిచేయాలని, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గొద్దని కిషన్‌రెడ్డి హితవు పలికారు. ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే రంగారెడ్డి చేస్తున్న ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, ఆయనపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కిషన్ రెడ్డి హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఏమైనా మంచి చేస్తారేమోనని ఆశించి, రెండేళ్లు వేచి చూశామని అన్నారు. కానీ ఈ రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ అరాచకాలు పెచ్చుమీరిపోయాయని, ఇకపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇకపై ప్రతి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. తమ సొంతవారికే కాంట్రాక్టులు ఇప్పిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. మలక్ పేట ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు ఏకంగా రూ.63కోట్ల టెండర్‌ను ఎమ్మెల్యే ఇప్పించారని, ఇందులో మాట్లాడుకున్నారన్నారు. మునగనూరులో రూ.150కోట్లు విలువచేసే భూమిని, యాచారం మండలం గున్‌గల్‌లోని సర్వే నెంబర్ 341లో పేదల భూములను కొల్లగొట్టే ప్రయత్నం ఎమ్మెల్యే చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నం ప్రాంతం చైతన్యానికి, ప్రజా పోరాటాలకు నిలయమని, కమ్యూనిస్టులకు అడ్డాగా ఉందని అన్నారు. ఇలాంటి ప్రాంతంలో మలక్ పేట రాజకీయాలు చేస్తానంటే కుదరదని కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, బొక్క గౌతమ్ రెడ్డి, కాకుమాను చిన్నయ్య, చెవుల దశరథ, రమావత్ కల్యాణ్ నాయక్, తాళ్లపల్లి మోహన్ గుప్తా, సాధు శ్రీనివాస్, రొక్కం ప్రభాకర్ రెడ్డి, ఏనుగు ఆనంద్ రెడ్డి, సంరెడ్డి సత్తిరెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, గౌని రాజుగౌడ్, కొండ్రు శ్రీనివాస్, కొండ్రు మల్లేశ్,తుమ్మలపల్లి వెంకటరెడ్డి, కొత్తకుర్మ శ్రీశైలం,శ్రీకాంత్ చారి, మెత్తరి అశోక్,చెవుల నరేందర్,ప్రభువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాటల్లోనే ప్రజాపాలన.. చేతల్లో రాజరికపు పాలన

**రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు**

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాటల్లోనే ప్రజాపాలన.. చేతల్లో రాజరికపు పాలన నడుస్తోందని మల్లేశ్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో క్యామ మల్లేశ్ మీడియాతో మాట్లాడారు.ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు పరిపాలన చేస్తేనే ప్రభుత్వం ఉంటుంది. రాష్ట్రంలో స్థానికసంస్థల గడువు ముగిసినా ఎన్నికలు పెట్టలేదు. అడవిబిడ్డ సీతక్క పంచాయతీ రాజ్ శాఖామంత్రిగా ఉన్నారు. 20 నెలలు నుంచి ఎన్నికలు పెట్టలేని అసమర్థ స్థితిలో సీతక్క ఉన్నారు. మంత్రి పదవికి సీతక్క రాజీనామా చేయాలి అని మల్లేశ్ డిమాండ్ చేశారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవీకాలం ముగిసింది. ఎన్నికలు పెట్టకుండా రేవంత్ రెడ్డి సామంతరాజులను నియమిస్తారా. ప్రభుత్వంలో అసమర్థ మంత్రులుగా ఉండి ఏం చేస్తారు?? గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకోవడం, దాచుకోవడానికి పరిమితం అయ్యారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలకు ప్రోటోకాల్ ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదు అని క్యామ మల్లేశ్ హెచ్చరించారు.తుమ్మల నాగేశ్వరరావు క్యాబినెట్‌లో సీనియర్ మంత్రి. నలుగురు ముఖ్యమంత్రుల దగ్గర మంత్రిగా తుమ్మల వున్నారు. తుమ్మల నాగేశ్వరరావు ఒక్క బీజేపీలోనే చేరలేదు. సహకార సంఘాలకు ఆరు నెలల పదవీకాలం పొడిగించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో ఛైర్మన్‌ను రద్దు చేసి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు.

## పెన్షన్ దారులకు న్యాయం చేయలేని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ....



**మునుగోడు సెప్టెంబర్ 23 ( ప్రభాత సూర్య )** పెన్షన్ దారులకు న్యాయం చేయలేని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని, తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ ని నిలదీసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ,మునుగోడు నియోజకవర్గ చేయూత పెన్షన్ దారుల సన్నహాక సభ మునుగోడు లోని పి ఆర్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, విహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ చేయుత పెన్షన్లు పెంచకుండా రేవంత్ రెడ్డి మోసం చేశాడు,2023 ఎన్నికల సమయం నవంబర్ లో నాకు ఓటు వేయండి డిసెంబర్ లో పెరిగే పెన్షన్లు తీసుకోమని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓట్లు దండుకున్నాక దారుణంగా మోసం చేశాడని అన్నారు, చేతగాని స్థితిలో ఉన్న పెన్షన్ దారులకు న్యాయం చేయాలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థుడిగా మిగిలిపోతున్నారని అన్నారు,పెన్జన్లు పెంచడమా లేదా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం మీద నుండి దిగిపోవడమో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు,అలాగే పెన్షన్ల గురించి మాట్లాడకుండా కేసీఆర్ మౌనం వహించడం దుర్మార్గమనిఅన్నారు, ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ పార్టీ పెన్షన్ దారుల పక్షాన నిలవడంలో విఫలమైందని అన్నారు,రేవంత్,కేసీఆర్ పేద వర్గాలకు చెందిన వాళ్లు కాదు కనుక పేద వర్గాలకు చెందిన పెన్షన్ దారుల గోడు పట్టడం లేదని అన్నారు, అందువల్ల పేద వర్గాలకు చెందిన బిడ్డగా పెన్షన్ దారులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ పోరాటాన్ని ముందుకు నడిపిస్తామని అన్నారు, వికలాంగులకు6000, వృద్ధులు, వితంతువులు,ఒంటరి మహిళలతో పాటు మిగతా పెన్షన్ దారులకు 4000 ఇవ్వాలని అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి నూతన పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు,ఈ డిమాండ్లను సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు, అక్టోబర్ 6 నుండి నవంబర్ 6 వరకు నెల రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో దీక్షలు చేపడుతామని అన్నారు,ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు విహెచ్పిఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మత్స్యగిరి, విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు తలారి సహదేవులు, మేతరి రాములు, డ్యూటీ శోభ ఒంటరి మహిళ ఆవుల లింగయ్య యాదవ్, వృద్ధాప్య పెన్షన్ దారుడు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మేడి శంకర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు ఎరిగి శ్రీశైలం మాదిగ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రసాని గోపాల్ మాదిగ ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందుల అంజయ్య మాది ఉపాధ్యక్షులు పందుల వెంకన్న మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పందుల మల్లేష్ మాదిగ పందుల సంపత్ మాదిగ టౌన్ ప్రెసిడెంట్ బోయపర్తి యాదయ్య మాదిగ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుండి అన్ని మండలాల నుండి పెన్షన్ దారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



**హైదరాబాద్ :** తెలంగాణవ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఎంగిలి బతుకమ్మతో ప్రారంభమైన వేడుకలు తొమ్మిది రోజులపాటు తెంగాణ వ్యాప్తంగా ,గ్రామగ్రామాన తీరొక్కపూలతో, భక్తిశ్రద్దల నడుమ జరుపుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలు భుజానెత్తుకున్నాయి. అధికార కాంగ్రెస్, బీఆర్ ఎస్, బిజేపీకి తోడు ఈఏడాది వేరుకుంపటి పెట్టిన తెలంగాణ జాగృతి వరకూ ఇలా వివిధ రాజకీ పార్టీలు బతుకమ్మ వేడుకలను తమ ఖాతాలో వేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బతుకమ్మ చీరలు, పాటలు ఒకటేమిటి, ఏం చేసినా బతుకమ్మపై భక్తిని మరచి,పొలిటికల్ టార్గెట్ గా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో ఈ ఏడాది బతుకమ్మ పట్టణాలకు మాత్రమే పరిమితం కాదు, రాష్ట్రపండుగా మొత్తం రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సజ్జల బతుకమ్మ వరకూ భక్తి శ్రద్దలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేసామంటోంది అధికార కాంగ్రెస్ ప్రభుత్వం. ఈనెల 26వ తేది వరకూ తెలంగాణలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 27వ తేది నుంచి 30వ తేదీ వరకూ హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకులను కనివినీ ఎరుగని స్థాయిలో నిర్వహిస్తున్నామంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. 28వ తేదిన లాల్ బహుదూర్ స్టేడియంలో 63 అడుగుల బతుకమ్మను ఏర్పాటు చేసి గన్నీస్ బుక్ రికార్డును సొంతం చేసుకోబోతున్నామని చెబుతున్నారు. ఇక్కడివరకూ అంతా బాగానే ఉంది కానీ, బతుకమ్మ వేడుకల్లో పంచే చీరలకు ఇందిరమ్మచీరగా పేరు మార్చడంపై పొలిటికల్ దుమారం రేగుతోంది. బతుకమ్మ చీరలకు ఇందిరమ్మ పేర్లేంటని రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బతుకమ్మ పేరు లేదా తెలంగాణ మహిళల పేర్లు పెట్టాలికానీ ,ఇలా ఇందిరమ్మపేర్లు పెట్టడం వల్ల తెలంగాణ తల్లికి బతుకమ్మను దూరం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ ఎస్ సైతం బతుకమ్మ వేడుకలను వైభవంగా జరిపేందుకు కేడర్ ను సన్నద్ధం చేసింది. ఇప్పటికే బిఆర్ఎస్ మహిళా నేతలు ఆయా జిల్లాలలో బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నారు. కానీ బిఆర్ఎస్ నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలలో సైతం పొలిటికల్ అజెండా బలంగానే వినిపిస్తోంది. తెలంగాణ సంసృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటను బిఆర్ ఎస్ పార్టీ అవహేళన చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ఉయ్యాల.. ఉయ్యాలో బతుకమ్మ అంటూ పాటను ప్రచారం చేయడం, అదే పాటతో బతుకమ్మ ఆడటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ విమర్శలు చేయాలంటే బతుకమ్మ పాటలను వాడుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తమవుతోంది.బిజెపి మహిళా మోర్చఆద్వర్యంలో ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు గతంలో ఎన్నడూ విధంగా వినూత్నంగా నిర్వహించడంతోపాటు, సాధ్యమైనంత ఎక్కువ మంది మహిళలతో మండల స్థాయిలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. బిఆర్ఎస్ నుంచి విడిపోయి వేరుకుంపటి పెట్టిన కవిత సైతం బతుకమ్మ వేడుకుల?లో తనకున్న బ్రాండ్ ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా దూసుకుపోతున్నారు. జాగృతి అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికే తన తండ్రి సొంత గ్రామం చింతమడక నుంచి బతుకమ్మ వేడుకులను ప్రారంభించిన కవిత తొమ్మిది రోజులపాటు తెలంగాణవ్యాప్తంగా వివిధ జిల్లాలలో బతుకమ్మ సంబురాలలో పాల్గొంటూ జాగృతి మార్క్ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇలా ఒక్కో పార్టీ ఒక్కో తీరుగా తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ వేడుకులను కేవలం పొలిటికల్ అజెండాతో నిర్వహిస్తూ , తెలంగాణ తల్లికి బతుకమ్మను దూరం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా?యి. కల్మషంలేని తీరొక్కపూలతో జరిగే వేడుకులకు ఈ రాజకీయ రంగులేంటనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

## ప్రజలను, పార్టీలను మోసగించడంలో అరికెపూడి గాంధీ ఘనుడు....

గాంధీ అని మహాత్ముడి పేరు పెట్టుకొని.. చేసేది ఆక్రమణలా..?....

భూ ఆక్రమణలపై కాంగ్రెస్ సర్కార్ వెనకడుగు వెనుక మతలబేంటీ..?...



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** పార్టీ మారిన ఎమ్మెల్యేకు త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు పేదోడికి పదేళ్ల కేసీఆర్ పాలనలో శ్రీరామ రక్షగా కేటీఆర్ అండగా నిలిచారు అన్ని భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై భారాస సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ ఆక్రమణలపై వస్తున్నఆరోపణలు నిజమేననేలా అరికెపూడి గాంధీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సైతం దొంగలకు సహకరిస్తూ, పేదలకు కూడు, గూడు లేకుండా చేస్తుందన్నారు. గాజులరామారంలోని భూ ఆక్రమణలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో వెనకాడటం వెనుక మతలభేంటీ..? అని ప్రశ్నించారు. పేదలు కట్టుకున్న ఇండ్లను కూల్చిన హైడ్రా, ఆ భూమి పక్కనే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆక్రమించినట్లుగా వస్తున్న సర్వే నెంబర్ 307ని భూములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ అని మహాత్ముడి పేరు పెట్టుకొని.. చేసేది అక్రమాలు, ఆక్రమణలా..? అని ప్రశ్నించారు. ప్రజలు గెలిపిస్తే పార్టీ మారి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమాస్తులను కాపాడుకునేందుకు పార్టీ మారారా..? అని ప్రజలు చర్చించుకుటున్నారని వెల్లడించారు. ప్రజలను, పార్టీలను మోసగించడంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఘనుడిగా కీర్తించబడుతున్నారని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై ఉందన్నారు. పేదల తరుపున ఎప్పుడూ అండగా ఉంటూ వస్తున్నది కేవలం భారాస మాత్రమేనన్నారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క పేదవారికి అన్యాయం జరగకుండా కేసీఆర్ శ్రీరామ రక్షగా నిలిచారని గుర్తు చేశారు. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ నాయకత్వంలో త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై, అక్రమాలపై పోరాటం సాగిస్తామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు.

## ఆర్థిక భవిష్యత్తును కాపాడే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉంది

-యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక గౌడ్



**చౌటుప్పల్.సెప్టెంబర్ 23. ప్రభాత సూర్య :** ప్రజల ఆర్థిక భవిష్యత్తును కాపాడే శక్తి ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన సింపుల్ జిఎస్టి ని వదిలేసి, బిజెపి దేశంపై"గబ్బర్ సింగ్ ట్యాక్స్ " లను మోపిందని అన్నారు. జి ఎస్టీ 2.0తో బీజేపీ మోసం చేస్తుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక గౌడ్ తెలిపారు. 9 స్లాబులతో ప్రజల జేబులు ఖాళీ చేసిందని, ఎనిమిదేళ్లలో 55కోట్లు వసూలు చేసిందని, ఇప్పుడు కేవలం 2.5 లక్షల కోట్లు ఇచ్చి'పొదుపు పండుగ' అని కేంద్ర ప్రభుత్వం నాటకం ఆడుతుందని అన్నారు.చిన్న వ్యాపారులు, రైతులు మధ్యతరగతి భారంతో నలుగుతూనే ఉన్నారని,రాష్ట్రాలకు రావలసిన న్యాయమైన పరిహారాన్ని బిజెపి అడ్డుకుంటుందని విమర్శించారు. ప్రజలంతా ఒకటై బీజేపీని నిలదీయాలని, ప్రజల ఆర్థిక భవిష్యత్తును కాపాడే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని పెద్దగోని మౌనిక గౌడ్ తెలియజేసారు.

## ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ పేదలకు అండా



**మునుగోడు సెప్టెంబర్ 23:(ప్రభాత సూర్య)** మునుగోడు మండల కేంద్రం పరిధిలోని ఉకొండి గ్రామానికి చెందిన మేడి యాదగిరి ప్రమాదవశాత్తు చనిపోయాడని తెలుసుకొని ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇరుగుదిండ్ల ఆశోక్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక పరిస్థితి బాగాలేదు అని తెలుసుకొని వారికి 10000/- రూపాయలు ఆర్థిక సాయం చేస్తూ క్వింటాల్ బియ్యం కూడా ఇవ్వడం జరిగింది, అలాగే మునుగోడులో మృతురాలు మెట్టు మారమ్మ కుటుంబన్నీ పరామర్శించి 50 కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది,ఈ కుటుంబాలకు ఎల్లవేళలా అండదండగా మన ఫౌండేషన్ ఉంటుందని చెప్పి మన మునుగోడు నియోజకవర్గం లో ఎక్కడ పేదవానికి ఇబ్బంది జరిగిన అక్కడ ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్ కుమార్, పుల్కరం సైదులు, దుబ్బ అనిల్,ఏర్పుల స్వామి, బాలకృష్ణ,నాతి లింగస్వామి, అభి, తదితరులు పాల్గొన్నారు

## మర్రిగూడ: పెన్షనుదారుల సన్నాహక సదస్సుకు వికలాంగులు



**మర్రిగూడ: ప్రభాత సూర్య 23** మునుగోడు నియోజకవర్గంలో నిర్వహించిన వికలాంగులు, చేయూత పెన్షనుదారుల సన్నాహక సదస్సులో పాల్గొనేందుకు మర్రిగూడ మండలంలోని వికలాంగులు, పెన్షనుదారులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ బృందానికి వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు మేతరీ రాములు నేతృత్వం వహించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలేష్ మాదిగ, కావేరి, మైలారపు రాజు తదితరులు పాల్గొని వికలాంగులు, పెన్షనుదారుల సమస్యల పరిష్కారంపై చర్చించారు.

## సంపాదకీయం

# ఒడిదుడుకుల అమెరికా- భారత్ సంబంధాలు

రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ యుక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందనే కుంటిసాకుతో, భారత్ అధిక సుంకాలు విధిస్తూ 'సుంకాల రారాజు'గా నిలిచిందని ఆరోపిస్తూ ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఈ విషయమైయమై బ్రెండెన్ ల్లించ్ నాయకత్వంలో క్రొత్త ఢిల్లీకి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి, భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి భారత బృందానికి మధ్య జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి కనిపించలేదు. అయితే భారత ప్రధాని నరేంద్రమోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయయడం, దృశ్య మాధ్యమాల ద్వారా చర్చలు కొనసాగించి రత్వరలోనే ఒక అంగీకారానికి రావాలని నిర్ణయించడమే ఓ సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలు, వివిధ రకాల వెన్నలు, పాలపొడి వంటి పాడి ఉత్పత్తులు ఎగుమతి చేయాలని, 146 కోట్ల అతి పెద్ద జనాభా గల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహ తహలాడుతోంది. అందుకు సరళమైన సుంకాల తో అనుమతి ఇవ్వాలని దశాబ్దాలుగా మన దేశంపై ఒత్తిడి తెస్తోంది. అయితే 86 శాతం చిన్న, సన్నకారు రైతులు, 8కోట్ల పాడిరైతుల జీవితాలపై దుష్ప్రభావము పడుతుందని భారత ప్రభుత్వం అందుకు అంగీకరించడంలేదు. అదీగాక పాల అధికోత్పత్తికి వాడే దాణాలో కలిపిన ఏంజైములుమ మాంస కృత్తులు అధికంగా ఉండటం, ఆరోగ్యానికి హానికరమని భావించడం, అవి భారత ఆచారాలు, సాంప్రపదాయలు,ఆహార అలవాట్లకు విరుద్ధంగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటికి అనుమతించడము లేదు.

దీంతో డాలర్ ప్రభువు ట్రంప్‌కు పట్టరాని ఆగ్రహము కిలిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి 50 శాతం సుంకాలు విధించడంతో, జౌళీ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, టోలు వస్తువులు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపద ఉత్పత్తిలో భాగస్వాములైన లక్షలాది మంది మహిళలు ఇతర శ్రామికుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం పడింది. పనులు, ఆదాయాలు కోల్పోయివారు వీధినపడి ఆక్రోషిస్తున్నారు. రొయ్యల ఎగుమతులలో 80 శాతం, చేపలు, సముద్రఉత్పత్తులో 39 శాతం ఆంధ్రప్రదేశ్ నుండి జరుగుతున్నాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు వాటి ఎగుమసతులు ఆగిపోయి 25 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ,అంచనా. అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేత జాతి దురహంకారాన్ని రెచ్చగొట్టి రెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ ఇంటాబయటా పెట్రేగి పోతున్నాడు. భారత్‌పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించి భారత్ 64.3, దక్షిణ కొరియా 57 శాతం, టర్కీ అన్ని వస్తువులపై 17.3, భారత దేశం సగటున16.2 సుంకాలు విధిస్తున్నాయి. అమెరికాలో సేద్యంపై ఆధారపడి జీవిస్తున్న వారు 2శాతం, యూరోపియన్ దేశాలలో కేవలం 4శాతం కాగా, చైనాలో 22 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అమెరికాలో వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలను కంపెనీలు అత్యాధునిక యంత్రాలు, నూర్పిడి పరికరాలతో చేయడం వల్ల సాగు ఖర్చు తక్కువ. యూరోప్ చైనా తదితర దేశాలలో కూడా యంత్రాల వాడకము వల్ల సాగు ఖర్చు తక్కువ ఉత్పాదకత ఎక్కువ. 2024లో చైనా100 బిలియన్ డాలర్లు, అమెరికా 59 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. అమెరికా భారీగా మొక్కజొన్న, పత్తి వంటి 182.8 బిలియన్ దాలర్లవ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, చైనా అనుభవాలను భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలి. పంట సీజన్లో యూరియా తదితర ఎరువులను సరఫరా చేయలేనిస్థితి భారత ప్రభుత్వానిది.మన దిగుమతులలో మూడోవంతు వంటనూనెలే. వాటిపై 10 శాతం సుంకం. పత్తిపై సున్నా, పచ్చబఠానీల పై నామమాత్రంగా సుంకాలున్నాయి.అమెరికా కోడికాళ్లపై వాల్ నట్స్ పై 100శాతం, యాపిల్స్ పై 50శాతం, పాలపొడిపై50 శాతం సుంకాలు విధిస్తున్నారు. మనదేశం అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు.బియ్యం దదిగుమతిపై 70 శాతం ఉంది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది కనుక అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత ప్రభుత్వ లక్ష్యానికి చేరాలంటే వివిధ రంగాలలో ఎన్నో మార్పులు తేవాలి. అమెరికా సుంకాలు ఆదేశానికి కూడా నష్టం కలిగిస్తాయని,ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళనలు వక్తమవుతున్నాయి. ప్రధాని మోడీ 2019 సెప్టెంబర్ లో అమెరికాలో పర్యటించి హ్యూస్టన్ లో జరిగిన సభలో ట్రంప్‌తో కర చాలనం చేశారు. ఇతర దేశాల ఆంతరంగిక రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదనే నియమాన్ని పక్కన పెట్టి 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ ట్రంప్ కు అనుకూ లంగా ప్రచారం చేశారు. అప్పుడు బిడెన్ గెలిచారు. అయినా సుంకాల విషయంలో రెండోసారి అధ్యక్షుడైన ట్రంప్ కరకుగా వ్యవహరిం చడమే గాక అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలెన్నో తీసుకున్నారు. హెచ్1బి వీసాలపై ఎన్నో ఆంక్షలు విధించాడు. భారత్ అమెరికాలలో మితవాద ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా ఇప్పుడు ప్రధాని మోడీ దేశ ప్రయోజనాల కోసం గళం వినిపించక తప్పలేదు. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధకాలం నుండి భారత అమెరికా సంబంధాలలో ఎన్నో ఒడిదుడుకులు తప్పడం లేదు. అమెరికా పాకిస్తాన్ పాలకులను దువ్వుతూ ఆయుధ,ఆర్థిక సాయం అందిస్తూ వస్తోంది. 1971 లో ఎన్నికయిన షేక్ ముజిబుర్ రహమాన్ కు పాక్ సైనిక పాలకులుఅధికారం అప్పగించకిపోవడం,సైనిక దమన కాండతో ఆగ్రహించిన బంగ్లా ప్రజలు విముక్తి పోరాటాన్ని ప్రారంభించగా భారత్ నైతిక మద్దతు ఇచ్చి ఆయుధ సహాయం చేసింది. లక్షలాదిమంది శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడుగా ఉన్న రిచర్డ్ నిక్సన్ పాక్‌కు మద్దతుగా తమ సప్తమ నౌకా దళాన్ని పంపారు. దీటుగా అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు మద్దతుగా నిలవడంతో వెనుదిరగక తప్పలేదు. అలా యెన్నో అవాంతరాలు, విభేదాలతో నడిచిన భారత అమెరికా సంబంధాలు 2000సం.లో అప్పటి అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటనకు రావడముతో కొత్త మలుపు తిరిగాయి. తర్వాత అధికారములోకి వచ్చిన భారత్‌మెరికా ప్రభుత్వాలు, నేతలు కూడా యధాశక్తి చేసిన కృషితో రెండు దేశాల సంబధాలు ఈ స్థాయికి వచ్చాయి. ఇటీవల భారత దళాలు పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసి ధ్వంసం చేసినపుడు తన జోక్యంతోనే భారత్ దాడులు ఆపిందని ట్రంప్ పదే పదే కోతలు కోయగా భారత్ ఖండించింది. ఏదేశంతో సంబంధాలైనా ,వాణి జ్యమైనా పరస్పర్సప్రయోజానాల ప్రాతిపదికగానే జరగాలి.ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కిలిగిస్తాయని ఆయుధ తదితరపరిశ్రమ వర్గాలు ఆందోళనవ వ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలునీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చు ననీ మినహాసయింపుఇవ్వడం కొంత ఊరట.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చ లు త్వరలో ఒక కొలిక్కి రాగలవని ఆశాభా వము వ్యక్తం అవుతోంది. మోడీ తన మిత్రుడని, భారత్ గొప్ప దేశమని ట్రంప్ కొత్త రాగం వలపించగా,అమెరికా సహజ మిత్రదేశం అని మోడీ స్పందన. భారత్ తొలి నుండి స్వతంత్ర విదేశాంగ వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది.సోవియట్ కుప్పకూలాక ఏకధ్రువ ప్రపంచంగా కొన్నాళ్ళు అమెరికా కు తిరుగులేదని ఊదరగొట్టారు. చైనాలో పుతిన్,మోడీ,షి జిన్ పింగ్ లసమావేశం తర్వాత అమెరికా తత్తరరపడి కొంత తగ్గింది. ప్రాచీన సంస్కృతి,నాగరికత గల భారత్ చైనాలు దగ్గరైతే ఉభయ తారకంగా వుంటుంది చైనాకు మన ఎగుమతులు పెంచాలి. ప్రస్తుతం దిగుమతులే ఎక్కువ. నాయకత్వం మన ప్రజల బహుళ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని దృఢంగా వ్యవరించినపుడే ,మన ఎగుమతులను వివిధ దేశాలకు విస్తరించినపుడే లక్ష లాదిమంది ఉద్యోగ ఉపా ధులను కాపాడగలం. భారత్ అన్ని రంగాలలో రానున్న కాలము లో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగ దానికి ఎంతో శ్రమించాల్సివుంది.

# విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ



విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించ వలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధి లోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలు పంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం ఎరగని నిర్మల, సున్నిత మనస్కులు విద్యార్థులు. వారు కూడా సంఘజీ వులే, సంఘంలో భాగస్వాములే, సంఘసేవ వారికీ సామాజిక బాధ్యతగా ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. విద్యను ఆర్జించే వయసులోనే యువతీ యువకులలో సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహ ను కలిగించేందుకు 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్) ప్రారంభమైంది. నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ, సమాజ సేవ చేసే లక్ష్యంతో జాతిపిత మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా మొదలు పెట్టారు. అప్పటి "విశ్వ విద్యాలయాల నిధుల సంఘం" (యూజీసీ) చైర్మన్ రాధాకృష్ణన్ జాతీయ సేవా పథకాన్ని విద్యా సంస్థలలో ప్రారంభించాలని సూచించారు. 1959 జనవరిలో జరిగిన సీఏబీఈ పాలక మండలి ఆయన సూచనకు ఆమోదం తెలిపింది. 1952లో పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించబడి, 4వ పంచవర్ష ప్రణాళికలో ప్లానింగ్ కమిషనర్ ద్వారా 5కోట్ల రూపాయలను ఎన్ఎస్ఎస్ పథకానికి కేటాయించారు. 1958లో అప్పటి ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ దేశంలోని ముఖ్య మంత్రులకు జాతీయ సేవా పథకాన్ని అమలు చేయాలంటూ లేఖలు రాశారు. ఈ పథకానికి తగిన వ్యూహ రచన చేయాలని కూడా ఆయన కేంద్ర విద్యాశాఖను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 విశ్వ విద్యాలయాలలో సుమారు 40,000 మంది వాలంటీర్లతో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వి.కె.ఆర్.రావు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 1999 నాటికి ఈ పథకంలో 13,52,000 మంది వాలంటీర్లు ఉన్నారు. 176 విశ్వ విద్యాలయాల పరిధిలో లక్షలాది మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో సేవలందిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్ఎస్ఎస్ యూనిట్లను కళాశాల స్థాయిలో ప్రారంభించారు. లక్షలాది మంది వాలంటీర్లు సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. మొక్కల పెంపకం, పారిశుద్ధ్యం, రక్తదాన శిబిరాలు, అక్షరాస్యత వంటి కార్యక్రమాల్లో విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సామాజిక కార్యక్రమాల అమలులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒకనాడు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఒకవైపు విద్యా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు సంఘసేవకు విద్యార్థులను సమాయాత్త పరచేదే జాతీయ సేవా పథకం. సామాజిక కార్యక్రమాలపై యువతకు తర్ఫీదునివ్వడమే గాక, వారి సేవలను వినియోగించు కోవడం ఎన్ఎస్ఎస్‌లో కనిపిస్తుంది. కళాశాల స్థాయిలో ఎన్ఎస్ఎస్ విభాగాలకు ప్రిన్సిపాల్ పర్యవేక్షకుడిగా, ఒక అధ్యాపకుడు ప్రోగ్రాం అధికారిగా వ్యవహరిస్తారు. సమాజ సేవ పట్ల ఆసక్తి చూపే విద్యార్థులను ఇందులో చేర్చుకుంటూ, ప్రతి వందమంది విద్యార్థులను ఒక యూనిట్‌గా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూంటారు. రెండు విద్యా సంవత్సరాలలో కనీసం 240 గంటలు సంఘసేవలో పాల్గొనేలా కృషి జరుగుతోంది. భావితరాలకు వారసులైన విద్యార్థులు జట్లుగా పనిచేస్తూ ఐక్యతా భావాన్ని పంచుకుంటారు. సమాజంలో విద్యార్థి తన స్థానాన్ని, గమ్యాన్ని నిర్ణయించు కొనేలా చేయడం ఇందులోని ప్రధాన అంశం. విద్యార్థులు చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో సామాజిక సేవలో పాల్గొనేలా చేయడమే జాతీయ సేవా పథకం ప్రధాన ధ్యేయం. కళాశాల ప్రిన్సిపాల్ నిర్ణయించిన ప్రకారం సమీప ప్రదేశాల్లో ఆలయాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాలలో అపరిశుభ్రతను తొలగించడం, మంచినీటి సౌకర్యాల మెరుగుదలకు శ్రమదానం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ శిబిరాలలో నిర్వహిస్తుంటారు. ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడి వసతులను గ్రామస్తుల సహకారంతో మెరుగు పరచేందుకు విద్యార్థులు కృషి చేస్తారు. రక్తదానం, ఉత్సవాలలో స్వచ్ఛంద సేవ, అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు విరాళాలు సేకరించి తగు సహాయ సహకారాలను అందించడం కూడా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలుగా ఉన్నాయి. అక్షరాస్యతా కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావడం, ఆరోగ్య సూత్రాలను బోధించడం, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాల్లోనూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా విశ్వ విద్యాలయాలు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తాయి. ఉద్యోగ నియామకాలు, ఇతర సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ లకు విలువ ఉంటుంది. ఆర్మీ, ఎయిర్ ఫోర్సు, మిలటరీ, నర్సింగ్ సర్వీసులలో, పోలీసు, టెలికాం, సమాచార వ్యవస్థ తదితర విభాగాల్లో నియామకాల సందర్భంగా ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. 'నా కోసం కాదు, నీ కోసమే..' అనే దీక్షా నినాదంతో- సేవలు అందించడమే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లక్ష్యం. యువతలో సామాజిక స్పృహను కల్పిస్తూ, వారిని సేవా భావంతో ముందుకు నడిపించడం నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. ఈ లక్ష్యంతో ఏర్పాటైన జాతీయ సేవా పథకం ఎంతోమంది విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ పథకంలో చేరిన వారు క్రమశిక్షణ, సామాజిక చైతన్యం కలిగి జీవితంలో ముందుకు రాణించే అవకాశం ఉంది.

# భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేద్దాం!




'హాలీవుడ్' పేరుకు ప్రేరణగా బొంబాయి కేంద్రంగా అంతర్జాతీయ స్థాయి చలనచిత్రాలను నిర్మిస్తున్న హిందీ సినీ పరిశ్రమను "బాలీవుడ్" అని పిలుస్తున్నాం. 1970ల్లో ప్రారంభంపైన బాలీవుడ్ సినీ వైభవం నేడు హాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించడం, అత్యుత్తమ సినిమాలను తీస్తూ ప్రపంచ సినీ ప్రేక్షకుల మనసులు దోయడం జరుగుతోంది. హిందీ భాష సినిమాల ద్వారా భారతీయ నృత్యాలు, సాంస్కృతిక వారసత్వ సంపద, కళలు, గీతాలు, సంగీత మాధుర్యాలను భారతీయ ప్రేక్షకులకు కాకుండా ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు సహితం పొందడం మన బాలీవుడ్ విజయంగా భావించాలి. తెలుగు సినీ పరిశ్రమను "టాలీవుడ్" అని, కేరళ మలయాళ సినీ పరిశ్రమను "మాలీవుడ్" అని, కన్నడ సినీ పరిశ్రమను "సాండల్‌వుడ్" అని, పంజాబీ సినీ పరిశ్రమను "పాలీవుడ్" అని, గుజరాతీ సినీ పరిశ్రమను "డాలీవుడ్" అని, బెంగాలీ/మరాటీ/ఒడియా సినీ పరిశ్రమను "ఓలీవుడ్" అని, అస్సామీ సినీ పరిశ్రమను "జాలీవుడ్" అని, భోజ్‌పురీ సినీ పరిశ్రమను "భోజ్‌వుడ్" అని, తమిళ సినీ పరిశ్రమను "కొలీవుడ్" (చెన్నై, కొడంబాకమ్ పేరుతో) అని, లాహోర్ కేంద్రంగా పాకిస్థానీ సినీ పరిశ్రమను "లాలీవుడ్" అని పిలవడం పరిపాటి అయ్యింది. భారత "జాతీయ సినీ అవార్డుల ప్రదానం", "అంతర్జాతీయ ఫిలిమ్ ఫెస్టివల్" నిర్వహణ, "ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా" ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాల నిర్వహణతో బాలీవుడ్ సినీ పరిశ్రమ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావడం చూస్తున్నాం. మన హిందీ సినిమాలు ప్రపంచ దేశాల్లో కూడా మంచి ఆదరణ పొందడం నేడు సర్వసాధారణం అయ్యింది. బాలీవుడ్ సినిమా ద్వారా మనసులను రంజింపజేసే సుస్వర సంగీతం, ఆకర్షణీయ క్లాసికల్/నాన్- క్లాసికల్ డ్యాన్సులు, మన ఆచార వ్యవహారాలు, భారతీయ జీవనశైలి, మానవీయ విలువలు, చారిత్రక/పౌరాణిక చరిత్రలు, మరిచి పోలేని పాత్రలు ఎన్నో మన బాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడం జరిగింది. 24 సెప్టెంబర్ 1913 రోజున దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన భారత తొలి పూర్తి నిడివి కలిగిన "రాజా హరిశ్చంద్ర" సినిమా విడుదల కావడంతో ఆ అపూర్వ ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున "ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం (వరల్డ్ బాలీవుడ్ డే)" పాటించడం 2014 నుంచి ప్రారంభం అయ్యింది. భారతీయ తొలి కలర్ సినిమా "కిషన్ కన్నయ్య" 1937లో విడుదల కావడం ఒక ప్రధాన అంశంగా తీసుకోవాలి. సామాజిక అంశాలతో కూడిన ఫామిలీ డ్రామాల కేంద్రంగా 1940ల్లో భారతీయ సినిమా స్వర్ణ యుగం ప్రారంభం అయ్యింది. ప్రపంచ సినీ ప్రభావంతో భారతీయ బాలీవుడ్ సినిమా కొత్త పుంతలు తొక్కుతూ, టెక్నాలజీని ఒంటపట్టించుకొని అద్భుతాలు తెరపై చూపిస్తూ బాలీవుడ్ సినీ పరిశ్రమ ఉజ్వలంగా ముందుకు సాగుతోంది. 1990ల తర్వాత పూర్వపు సినీ పరిశ్రమ నూతన రంగురంగుల కాస్ట్యూమ్స్, అద్భుత సంగీత సరాగాలు, ఉద్విగ్నభరిత కథ గమనాలతో "న్యూ బాలీవుడ" రంగులు పూసుకొని దేశ సరిహద్దులను చెరిపివేస్తూ ప్రపంచ మానవాళి ఇంటిలో, వారి మనసుల్లో తిష్ట వేస్తున్నది. నాటి బాలీవుడ్ సినిమాలు షోలే, దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, ముగల్-ఈ- ఆజామ్, త్రీ-ఈడియట్స్ లాంటి సినిమాలు ప్రపంచ బాక్స్ ఆఫీస్‌లను సహితం బద్దలు కొట్టడం జరిగిపోయింది. బాలీవుడ్ సినిమాల్లో అత్యంత పొడవైన సినిమాగా "ఎల్‌ఓసి కార్గిల్" సినిమా (గంటలు 4.15 నిమిషాలు) నిలిచింది. నేడు ప్రతి ఏట బాలీవుడ్ పరిశ్రమ నుంచి దాదాపు 1,000 సినిమాలు నిర్మితం అవుతున్నాయి. అన్ని భాషల్లో కలిపి భారతీయ సినీ పరిశ్రమ ద్వారా ఏడాదికి 3,000 సినిమాలు విడుదలై దాదాపు 10,000 సినీ థియేటర్లలో ప్రదర్శిస్తాం అవుతున్నాయి. ప్రపంచ బాలీవుడ్ దినోత్సవ వేదికగా మన సినీ పరిశ్రమ కీర్తిని చర్చించుకోవడం, పైరసీ సమస్యను కట్టడి చేయడం, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు తీయడం, డిజిటల్ యుగపు యువత దృష్టిని ఆకట్టుకోవడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరగాలి. వాణిజ్యపరమైన సినిమాలతో పాటు మన పునాదుల ఆధారంగా సంస్కృతి వారసత్వాలు ఉట్టిపడే విధంగా సినిమాలు తీయడం సమాంతరంగా కొనసాగాలి. సినిమా ఒక వినోదం మాత్రమే కాదని, ఆ పరిశ్రమ ద్వారా మన కళలను కాపాడుకోవడం, సంస్కృతులను రేపటి తరానికి పరిచయం చేయడం, ఆ కథల నుంచి స్ఫూర్తిని పొందడం జరగాలి. నేడు ఓటిటి వేదికలు రావడం, గ్రాఫిక్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక అతి పెద్ద ప్రజాదరణ పొందిన పరిశ్రమగా కొనసాగుతున్నది. భిన్న భాషల భారతంలో అనేక సినిమాలు విడుదల అవుతూ మనకు తెలియకుండానే మన సామాజిక జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నేటి సినిమాలు మన సంస్కృతికి అద్దం పడుతూ, కళలను పోషిస్తూ, కథలతో కట్టిపడేస్తూ, పరిమిత స్థాయిలో పాశ్చాత్య రంగులను పులుముకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం.

## బిజినెస్

# 375 వస్తువుల ధరలు తగ్గుతాయ్

### పన్నులు తగ్గడంతో మారుతీ సుజుకి, హ్యూండాయ్ కార్ల కోసం రికార్డు బుకింగ్‌లు




జీఎస్టీ పన్నులు తగ్గడంతో పాటు పండుగ సీజన్, కంపెనీలు ధరలు సవరించడంతో ఈ ఏడాదికి వాహన పరిశ్రమ రికార్డు స్థాయిలో డిమాండ్‌ను చూస్తోంది. ఇప్పటికే మారుతీ సుజుకి, హ్యూండాయ్ మోటార్ ఇండియా ఊహించని స్థాయిలో బుకింగ్‌లు సాధించామని వెల్లడించాయి. దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకి ఇప్పటికే అత్యధిక ఎంక్వైరీలు, బుకింగ్‌లు అందుకున్నామని తెలిపింది. గత 35 ఏళ్లలో చూడని స్థాయిలో జీఎస్టీ తగ్గింపు నిర్ణయం అమలులోకి రావడంతో సోమవారం మొదటిరోజే 80,000 ఎంక్వైరీలు వచ్చాయని, 25,000 కంటే ఎక్కువ కార్లను డెలివరీ చేశామని వెల్లడించింది. ఇప్పటివరకు 75,000 బుకింగ్‌లు వచ్చాయని, రోజుకు 15 వేల బుకింగ్‌లు జరుగుతున్నాయి. త్వరలో మేము 30,000 డెలివరీలు ఇవ్వగలమని, ఇప్పటివరకు బుకింగ్‌లు సాధారణంగా వచ్చే దానికంటే 50 శాతం ఎక్కువ బుకింగ్‌లు అవుతున్నాయని మారుతీ సుజుకి మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ అన్నారు. హ్యూండాయ్ మోటార్ సైతం నవరాత్రి మొదటి రోజు కావడంతో ఐదేళ్లలోనే అత్యధిక సింగిల్-డే బిల్లింగ్ జరిగినట్టు కంపెనీ హెూల్-టైమ్ డైరెక్టర్, సీఓఓ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు.

### తగ్గిన ఉత్పత్తులతో 'జీఎస్టీ స్టోర్'




### ప్రత్యేక సెక్షన్ ప్రారంభించిన అమెజాన్

కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేసిన జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి కస్టమర్లకు ప్రయోజనాలను అందించేందుకు ఈ-కామర్స్ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే అమెజాన్ ఇండియా కూడా తగ్గిన పన్నుల గురించి కస్టమర్లకు తెలిసేలా ప్రత్యేక సెక్షన్‌ను తీసుకొచ్చింది. పన్నులు తగ్గిన ఉత్పత్తులు విడిగా కనిపించేలా 'జీఎస్టీ స్టోర్ ' పేరుతో సెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఇతర విభాగాల్లో తక్కువ ధరలు ఉన్న వాటిని ఈ సెక్షన్‌లో పొందుపరిచింది. మంగళవారం(సెప్టెంబర్ 23) నుంచి గ్రేట్ ఇండియా ఫెస్టివల్ సేల్ ప్రారంభం కానుండటంతో అమెజాన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైమ్ సభ్యులకు సెప్టెంబర్ 22 అర్ధరాత్రి నుంచే ముందస్తు యాక్సెస్ లభిస్తుంది. జీఎస్టీ స్టోర్ బ్యాడ్జ్ వల్ల కస్టమర్లు తగ్గిన పన్ను ఆఫర్లను సులభంగా గుర్తించడం, షాపింగ్ చేయడానికి వీలవుతుంది. ప్రైమ్ ఎర్లీ యాక్సెస్ సమయంలో ఈ బ్యాడ్జ్ ప్రైమ్ డీల్ంజీఎస్టీ సేవింగ్స్ అని ఉంటుంది. సేల్ అందరికీ ఉన్న

గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) సంస్కరణలు సెప్టెంబర్ 22, 2025 నుంచే అమలులోకి వస్తున్నాయి. ఈనెల మొదటి వారంలో వస్తు సేవల పన్ను మండలి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 5, 18 శాతం పన్ను శ్లాబులను కొనసాగిస్తూ 12, 28 శ్లాబులను తొలగించింది. దీంతో సెప్టెంబర్ 22 నుంచి 5, 18 శాతం పన్ను శ్లాబులే అమలు అవుతాయి. దీంతో ఏకంగా 375 రకాల వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఈ జాబితాలో డైరీ ప్రొడక్ట్స్, కార్లు, ఔషధాలు, వంట సామగ్రి నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు చాలా కేటగిరీల వస్తువులు ఉన్నాయి. ఏ వస్తువుల ధరలు తగ్గుతున్నాయి? ముఖ్యమైన వాటి జాబితా ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఆహార పదార్థాల జాబితాలో పాలతో ఉన్న పానియాలు, ఘనీభవించిన పాలు, బిస్కెట్లు, కార్న్ ఫ్లేక్స్, సీరల్స్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ పల్ప్, ఫ్రూట్ జూస్, నెయ్యి, ఐస్ క్రీమ్, జామ్, ఫ్రూట్ జెలీస్, కెచప్, ఉప్పు, పనీర్, పాస్ట్రీ, మాంసం, ప్యాకేజ్డ్ కొబ్బరీ నీళ్లు ఉన్నాయి. షేవ్ లోషన్, ఫేస్ క్రీమ్, ఫేస్ పౌడర్, హెయిర్ ఆయిల్, షాంపూ, షేవింగ్ క్రీమ్, టాల్కమ్ పౌండర్, టూత్ బ్రస్, టాయిలెట్ సబ్బులు వంటివి ఉన్నాయి. ఎయిర్ కండీషనర్లు, డిష్ వాషర్స్, టీవీలు, వాషింగ్ మెషన్స్ ఉన్నాయి. డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకో మీటర్లు వంటి మెడికల్ డివైజులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గుతుంది. దీంతో వాటి ధరలు తగ్గుతాయి. వాటిపై ఎంఆర్పీ ధరలను తగ్గించాలని కేంద్రం ఫార్మసీలను ఆదేశించింది. బార్బర్స్, ఫిట్‌నెస్ సెంటర్స్, హెల్త్ క్లబ్స్, సెలూన్స్, యోగా కేంద్రాల వంటి



వాటిపై జీఎస్టీ తగ్గుతుంది. వాటి ధరలు దిగివస్తాయి. ఇంటి కొనుగోలుదారులు లేదా నిర్మాణదారులకు జీఎస్టీ ద్వారా భారీగా ప్రయోజనం కలగనుంది. సిమెంట్ ధరలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. దీంతో నిర్మాణ ఖర్చు భారీగా తగ్గనుంది. కార్లు, ఇతర వాహనాలపై జీఎస్టీ భారీగా తగ్గుతుంది. ఇంతకు ముందు పన్నులు సెస్ తో కలిపి 35 శాతం నుంచి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు ఫ్లాట్ 40 శాతం గా మార్చారు. సెస్ ఎత్తివేశారు. దీంతో గరిష్ఠ పన్ను ఇదే. అలాగే చిన్న కార్లపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. ఇప్పటికే మారుతీ, టాటా వంటి కంపెనీలు ధరల తగ్గింపు ప్రకటనలు చేశాయి. వీటితో పాటు ప్రముఖ కన్స్యూమర్ బ్రాండ్లు అములల్, హెచ్‌యూఎల్, లోరియల్, హిమాలయా వంటివి తమ ఉత్పత్తులపై ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటనలు చేశాయి.

# సేవింగ్స్ ఖాతా ఉంటే చాలు.. రోజుకు రూ.1,50,000.. 6.5 శాతం వడ్డీ

ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సహా దాదాపు అన్ని బ్యాంకుల్లో పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు 3 శాతం లోపే ఉంటుంది. కొన్ని బ్యాంకులు మాత్రమే అధిక డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తాయి. అయితే, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. సేవింగ్స్ ప్రో అకౌంట్ లాంచ్ చేసినట్లు ప్రకటించింది. ఈ బ్యాంకు ఖాతాలో ఉండే అదనపు డబ్బులపై ఎక్స్‌ట్రా రిటర్న్లు ఆఫర్ చేస్తున్నట్లు తెలిపింది. సేవింగ్స్ ప్రో అనేది ఆటో స్వీప్ అకౌంట్. అకౌంట్లో ఉండే అదనపు ఫండ్స్‌ని ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి గరిష్ఠ వడ్డీ ఆదాయం అందిస్తామని తెలిపింది.జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ సేవింగ్స్ ప్రో అకౌంట్ ద్వారా ఆటోమేటిక్‌గా అదనపు డబ్బులను ఓవర్ నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి 6.50 శాతం వరకు రిటర్న్లు అందించే ప్రయత్నం చేస్తుంది. గ్రోత్ ప్లాన్స్‌లోని 2 ఏళ్ల వార్షిక లాభాల ఆధారంగా ఈ రిటర్న్లు ఉంటాయని తెలిపింది. సేవింగ్స్ ప్రో అనేది ఒక ఆటో స్వీప్ సేవింగ్స్ అకౌంట్. ఈ ఖాతా తీసుకున్నవారు థ్రెషోల్డ్ అమౌంట్ ఎంపిక చేసుకోవాలి. కనీసం రూ.5000గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అంటే ఈ రూ.5 వేలకు మించి అమౌంట్ ఖాతాలో ఉన్నప్పుడు ఆ డబ్బులను తక్కువ రిస్క్ ఉండే ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఆటమేటిక్‌గా ఇన్వెస్ట్ చేస్తారు. ఈ సౌకర్యం ద్వారా రోజుకు గరిష్ఠంగా రూ.1,50,000 వరకు పెట్టుబడి పెట్టే అవకాశం కల్పిస్తున్నట్లు జియో పేమెంట్స్ బ్యాంక్ తెలిపింది. సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ నిబంధనల ప్రకారం రిడంప్షన్ ఆప్షన్స్ ఉంటాయి. కస్టమర్లు తక్షణే 90 శాతం వరకు ఫండ్స్ తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. గరిష్ఠంగా రూ.50 వేల వరకు తీసుకోవచ్చు.



అంతకు మించితే 1 టూ 2 వర్కింగ్ డేస్‌లో ప్రాసెసింగ్ అవుతుంది. ఈ స్కీమ్‌లో ఎలాంటి హిడెన్ ఛార్జీలు, ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్స్, లాకిన్ పీరియడ్స్ ఉండవు.

## స్పోర్ట్స్

# బంగ్లాదేశ్‌పై భారత్ ఫైనల్ బెర్త్ లాక్ చేసుకోవడానికి సిద్ధం

ఆసియా కప్ 2025లో భారత్ జట్టు అద్భుతమైన ఫామ్‌లో ముందుకు సాగుతోంది. సూపర్-4 దశలో పాకిస్థాన్‌పై సాధించిన ఆరు వికెట్ల తేడాతో విజయం భారత్‌కు భారీ ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది.అభిషేక్ శర్మ (74 బంతుల్లో 39 రన్స్) మరియు శుభ్మాన్ గిల్‌ల మొదటి వికెట్‌కు 105 రన్స్ పార్టనర్‌షిప్, తిలక్ వర్మా (30లి ఆఫ్ 19) ఫినిషింగ్ టచ్‌లు ఈ విజయానికి కీలకం. పాకిస్థాన్ 171/5కి పరిమితమైంది, భారత్ 18.5 ఓవర్లలో లక్ష్యాన్ని సులభంగా చేరుకుంది. ఈ విజయంతో భారత్ సూపర్-4 పాయింట్స్ టేబుల్‌లో టాప్ స్థానంలో ఉంది, ఫైనల్ బెర్త్ కోసం ఒక అడుగు ముందుంది. రేపు (సెప్టెంబర్ 24) బంగ్లాదేశ్‌తో జరిగే కీలక మ్యాచ్ భారత్‌కు ఫైనల్ టికెట్ ఖాయం చేసుకునే అవకాశాన్ని అందిస్తుంది. బంగ్లాదేశ్ గ్రూప్ స్టేజ్‌లో శ్రీలంకకు ఓడిపోయి, ఇతర మ్యాచ్‌లలో కష్టపడినా, సూపర్-4లో బలమైన ప్రదర్శన చేస్తున్నారు. అయితే, భారత్ పోలీషింగ్ బ్యాటింగ్ మరియు బౌలింగ్ లైనప్‌తో ఈ మ్యాచ్‌ను డామినేట్ చేయగలదు. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే ఈ టీ20 మ్యాచ్‌లో, టాస్ మరియు పిచ్ కండిషన్స్ కీలకం. భారత్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ మ్యాచ్‌ను వినరీ చేసుకుంటే, ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయం అవుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తుది జట్టులో కొన్ని మార్పులు జరిగే




అవకాశం ఉంది. గత మ్యాచ్‌లలో బుమ్రా ఫామ్‌లో లేకపోవడం, సంజు సమ్సన్ స్కోరింగ్‌లో ఇబ్బంది పడటంతో వారిని బెంచ్‌కు పంపి, అర్ష్దీప్ సింగ్ మరియు జితేష్ శర్మాను బ్రింగ్ చేయవచ్చు. బంగ్లాదేశ్ బలహీనమైన బౌలింగ్ లైనప్‌కు వ్యతిరేకంగా, భారత్ బ్యాటింగ్ ఆర్డర్‌ను మరింత బలోపేతం చేయాలి. ఈ మార్పులు భారత్‌కు మరింత ఫ్రెష్‌నెస్ మరియు బ్యాలెన్స్‌ను తీసుకొస్తాయి, ముఖ్యంగా మిడిల్ ఓవర్‌లలో బౌలర్లు కొంత లీకేజీ చూపిన నేపథ్యంలో.


### మ్యాచ్‌కు ముందే పాకిస్థాన్ ఎదురుదెబ్బ!

ఆసియా కప్ 2025 టోర్నమెంట్లో భాగంగా ఇవాళ మరో సూపర్ ఫైట్ జరగనుంది. సూపర్ ఫోర్ లో భాగంగా అబుదాబీలోని అంతర్జాతీయ స్టేడియం వేదికగా శ్రీలంక వర్సెస్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఇవాళ ఉంది.భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి 8 గంటల సమయంలో ఎప్పటిలాగే ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్ రెండు జట్లకు చాలా కీలకము. ఎందుకంటే సూపర్ ఫోర్ లో భాగంగా ఇప్పటికే చెరో మ్యాచ్ ఆడాయి ఈ రెండు జట్లు. ఇందులో పాకిస్తాన్....టీమిండియా చేతిలో ఓడిపోగా... బంగ్లాదేశ్ చేతిలో శ్రీలంక ఓడిపోయింది. అంటే ఈ రెండు జట్లు ఇవాల్టి మ్యాచ్ కచ్చితంగా గెలవాలి. గెలిచిన జట్టుకే ఫైనల్ అవకాశాలు ఉంటాయి. ఇవాళ ఏ జట్టు ఓడిపోయినా ఇంటికి వెళ్లడం గ్యారంటీ. ఇలాంటి నేపథ్యంలో పాకిస్తాన్ కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఇవాల్టి మ్యాచ్ కు మరోసారిగా ఆండీనే రంగంలో దించబోతున్నారని తెలుస్తోంది. పాకిస్తాన్ ఆడే ప్రతి మ్యాచ్




కు అతడే రిఫరీగా ఉంటారట. ఇండియా షేక్ హ్యాండ్ ఇవ్వనందుకుగాను...ఆండీ పైన పాకిస్తాన్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

### వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు భారత్‌కు షాక్..



ఆసియా కప్ 2025 టోర్నీ ముగిసిన రోజుల వ్యవధిలోని టీమిండియా.. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఇందుకోసం మంగళవారం లేదా బుధవారం భారత జట్టును ఎంపిక చేయనున్నారు.ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అయితే అండర్సన్, సచిన్ టెస్ట్ సిరీస్‌లో గాయపడ్డ టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ .. ఈ సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలు కనిపించడం లేదు.వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అక్టోబర్ 2 నుంచే ప్రారంభం కానుంది. అంటే ఇంకా పది రోజుల సమయం ఉంది. కానీ పాదానికి తీవ్ర గాయం కావడంతో ఆసియాకప్‌కు దూరమైన పంత్.. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు సైతం దూరం కానున్నాడని వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా ఎంపికకానున్నాడు. అతడికి బ్యాకప్ వికెట్ కీపర్‌గా నారయణ్ జగదీషన్ జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఇంగ్లాండ్ పర్యటనలో టీమిండియా వైస్ కెప్టెన్‌గా పంత్ వ్యవహరించాడు. అతడు లేకపోవడంతో గిల్‌కు డిప్యూటీగా కేఎల్ రాహుల్ నియమితుడయ్యే అవకాశం ఉంది. ఇక ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో నిరాశపరిచిన కరుణ్ నాయర్‌కు చోటు దక్కకపోవచ్చు. ఆసియా కప్ 2025 టోర్నీకి దూరంగా ఉన్న మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం భారత్-ఏ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా-ఏతో అనధికారిక టెస్ట్ సిరీస్ ఆడుతున్నాడు. అతడు టెస్ట్ టీమ్‌లోకి రానున్నాడు. దేవ్‌దత్ పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్ సైతం రేసులో ఉన్నారు. గాయం నుంచి కోలుకున్న నితీశ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం ముమ్మర సాధన చేస్తున్నాడు. అతడు సైతం వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికకానున్నాడు.




# ఆయన నాలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని నింపుతున్నారు

యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ 'సప్త సాగరాలు దాటి' చిత్రంతో వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కాంతార చాప్టర్: 1'. రిషబ్ శెట్టి స్వయం దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని హెూంబలే ఫిల్మ్స్ భారీ డ్జెట్‌తో నిర్మిస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ క్రమంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన చిత్రబృందం వరుస అప్డేట్స్ విడుదల చేస్తున్నారు.తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ లాంచ్ చేయగా.. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న రుక్మిణి ఆసక్తికర కామెంట్స్ చేసింది. "నా ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకు మూవీ టీమ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రిషబ్ శెట్టి మొదటి నుంచి నన్ను ప్రోత్సహిస్తున్నారు. ఆ ప్రోత్సాహంతోనే నేను ఇప్పుడు ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ఇలాంటి గొప్ప పాన్ ఇండియా మూవీలో అవకాశం అందుకున్నాను. నిజంగా ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. చాన్స్ ఇచ్చిన రిషబ్ శెట్టికి కృతజ్ఞతలు తెలియజేయడానికి నా దగ్గర పదాలు లేవు. ఆయన ఎప్పటికప్పుడు నాలో కొత్తదనాన్ని నింపుతూ.. నన్ను ప్రోత్సహిస్తూ ఇప్పుడు మీ ముందు యువరాణిలా నిల్చోబెడుతున్నారు. దీనికి ఆయనకు నేను రుణపడి ఉంటా. షూటింగ్ సమయంలో రిషబ్ శెట్టి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నా జీవితాన్ని పూర్తిగా మార్చేసిన 'కాంతార' నాకు మరో జీవితాన్ని ప్రసాదిస్తుందని భావిస్తున్నా" అని చెప్పుకొచ్చింది.



# అర్జున్ దాస్ దశ తిరుగుతోంది

వయసు చిన్నదే అయినా విలనీ పండించడంలో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ దాస్ చేసింది తక్కువ సినిమాలే. అయినా సరే ప్రేక్షకుల్లో తగినంత గుర్తింపు ఉంది. ముఖ్యంగా అతని బేస్ వాయిస్ కున్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. కల్కి 2898 ఏడి కోసం ప్రత్యేకంగా వాయిస్ ఓవర్ చెప్పించారంటే తన రీచ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఓజి టీజర్ లో అలాంటోడు మళ్ళీ తిరిగి వస్తున్నాడంటే డైలాగు మారుమ్రోగిపోవడానికి కారణం కూడా ప్రత్యేకంగా అనిపించే గొంతే. ఇమ్రాన్ హాష్మీతో పాటు విలన్ గా అర్జున్ దాస్ కూడా ఓజిలో ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. ఇది పెద్ద బ్రేక్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాడు.అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీలో విలన్ గా డ్యూయల్ రోల్ చేసి మెప్పించిన అర్జున్ దాస్ కు ఇప్పుడు బాలీవుడ్ అవకాశాలు తలుపు తడుతున్నాయి. రణ్వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందబోయే డాన్ 3లో విలన్ గా అర్జున్ దాస్ నే సంప్రదించారని ముంబై టాక్. లుక్ టెస్ట్, శాంపిల్ షూట్ చేసి సరిపోతాడనుకుంటే వెంటనే అడ్వాన్స్ ఇచ్చేందుకు రెడీగా ఉన్నారట. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ లాంటి లెజెండరీ హీరోలు చేసిన పాత్ర కావడంతో రణ్వీర్ సింగ్ డాన్ 3 కోసం చాలా ప్రిపేర్ అవుతున్నాడు. ఇంకా ప్రారంభం కానప్పటికీ స్క్రిప్ట్ స్టేజిలోనే ఒకటికి పదిసార్లు వడబోత చేస్తున్నారు. నిజంగా అర్జున్ దాస్ కనక డాన్ 3కి ఎంపికైతే బాలీవుడ్ లో మెల్లగా జెండా పాతేయొచ్చు. అసలే అక్కడ విలన్ల కొరత తీవ్రంగా ఉంది. అందులోనూ డాన్ ఫ్రాంచైజ్ అంటే క్రేజ్ ఖచ్చితంగా ఉంటుంది. మరి అర్జున్ దాస్ కి ఆ అదృష్టం రాసిపెట్టి ఉందో లేదో చూడాలి. తెలుగులో ఆక్సిజన్ తో ఎంట్రీ ఇచ్చిన ఇతను మళ్ళీ బుట్టబొమ్మలోనే కనిపించాడు. రెండూ పెద్దగా ఆడలేదు. తమిళ డబ్బింగులు మాస్టర్, విక్రమ్, ఖైదీ ఎక్కువ పేరు తీసుకొచ్చాయి. ఇప్పుడు ఓజి రూపంలో కనక బ్లాక్ బస్టర్ అందుకుంటే ఇక్కడా బిజీ అయిపోవచ్చు. ఆల్రెడీ పలువురు నిర్మాతలు కలిశారట కానీ ఓజి రిజల్ట్ వచ్చాకే చెబుతానని అన్నాడట.



# ఇక అందరూ సైడ్ అవ్వాల్సిందే !


ఇండస్ట్రీ లోకి చాలామంది హీరోయిన్లు వస్తున్నారు. ఇందులో కొంతమంది సక్సెస్ అవుతుంటే... మరికొంతమంది సక్సెస్ అయ్యేందుకు చాలా కష్టపడుతున్నారు.ఇక మరికొంతమంది హీరోయిన్లు... అతి తక్కువ కాలంలోనే పెద్ద సినిమాల్లో ఛాన్సులు కొట్టేస్తున్నారు. అయితే ఇలాంటి కేటగిరీలోకి హీరోయిన్ రుక్మిణి వసంత్ కూడా వస్తారు. కర్ణాటక కు చెందిన రుక్మిణి వసంత్ 2019 నుంచి ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. కన్నడ, తమిళ్, తెలుగు లో ఇప్పటికే సినిమాలు చేశారు ఈ అందాల తార. తెలుగులో అప్పుడో ఇప్పుడు ఎప్పుడో అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న డ్రాగన్ సినిమాలో కూడా ఆమెకు ఛాన్స్ దక్కింది. అయితే... ఈ రుక్మిణికి కాంతార చాప్టర్ 1 లో కూడా ఛాన్స్ దక్కింది. ఈ సినిమా దసరా కానుగా రిలీజ్ కానుంది. ఇలాంటి నేపథ్యంలో కాంతార చాప్టర్ 1 మూవీ ట్రైలర్ రిలీజ్ అయింది. ఇందులో హీరో రిషబ్ శెట్టితో రొమాన్స్ కూడా చేసిన విజువల్స్ వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె గ్లామరస్ ఫోటోలు కూడా ట్రెండింగ్ లోకి వచ్చాయి. ఇక ఈ ఫోటోలు చూసిన సినీ ప్రియులు స్పందిస్తున్నారు. రుక్మిణి వసంత్ కూడా రష్మిక, సాయి పల్లవి లాగే మరో 10 ఏళ్లు ఇండస్ట్రీని షేక్ చేయడం గ్యారెంటీ అంటున్నారు. డ్రాగన్ సినిమా రిలీజ్ అయితే తెలుగులో నెంబర్ 1 హీరోయిన్ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు చెబుతున్నారు.

# ఆశ, అంధకారానికి మధ్య జరిగే యుద్ధం



దర్శకుడు ప్రశాంత్ వర్మ, మరో సూపర్ హీరో సినిమా 'అధీర' కోసం ఆర్.కె.డి స్టూడియోస్‌తో కలిసి పని చేయ బోతున్నారు. ఈ సినిమాతో కళ్యాణ్ దాసరి హీరోగా పరిచయం అవుతుండగా, కీలక పాత్రలో ఎస్.జే.సూర్య కనిపించనున్నారు. రివాజ్ రమేష్ దుగ్గల్ నేతృత్వంలోని ఆర్కేడీ స్టూడియోస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఈ చిత్రం భారతీయ ఇతిహాసాల స్ఫూర్తితో, గ్రేట్ విజువల్స్‌తో తెరకెక్కుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఎస్.జే.సూర్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. క్రూరమైన రాక్షసుడిలా ఉన్న సూర్య ముందే కళ్యాణ్ దాసరి మోకాళ్లపై కూర్చుని ధైర్యంతో పైకి చూస్తూ మోడరన్ వార్ అవతార్‌లో ట్రూ సూపర్ హీరోలా ఈ పోస్టర్‌లో కనిపించారు. ఇది ఆశ, అంధకారం మధ్య జరిగే యుద్ధం. ధర్మాన్ని రక్షించడానికి కళ్యాణ్ దాసరి తన సూపర్ పవర్స్‌ని ఉపయోగిస్తారు. అద్భుతమైన యాక్షన్, స్టంట్స్, గ్రేట్ విజువల్స్, హై వోల్టేజ్ డ్రామాతో ఈ సినిమా థియేటర్స్‌లో థండర్‌క్లాప్ ఎక్స్‌పీరియెన్స్ అందించనుంది అని మేకర్స్ తెలిపారు.

# దయచేసి ఆ వార్తలు నమ్మకండి..



బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈక్రమంలో ఆయన ఓ సినిమాలో వాల్మికి మహర్షి పాత్రలో నటిస్తున్నట్లు ఏఐతో క్రియేట్ చేసిన పలు వీడియోలు వస్తున్నాయి. ఇక అది చూసిన అక్షయ్ కుమార్ ఫుల్ ఫైర్ అయ్యాడు. ట్విట్టర్ ద్వారా ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ కీలక నోట్ రిలీజ్ చేశారు. "గత కొద్ది కాలంగా కొన్ని తప్పుడు వార్తలు ప్రచారం అవుతున్నాయి. దీనిపై నేను క్లారిటీ ఇవ్వదలుచుకున్నాను. నేను మహర్షి వాల్మీకి పాత్రలో నటిస్తున్నట్లు.. ట్రైలర్ కూడా విడుదలైనట్లు కొన్ని వీడియోలను చూశాను. అవి ఎఐని ఉపయోగించి సృష్టించబడ్డాయని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. అవన్నీ ఫేక్ దయచేసి మీరు నమ్మకండి. దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్ని వార్తా ఛానెల్‌లు ఇవి నిజమైనవా లేదా మార్ఫింగ్ చేయబడినవా అని కూడా ధృవీకరించకుండా వార్తలు రాశారు. నేటి కాలంలో, మోసపూరిత ఎఐ ద్వారా తప్పుదారి పట్టించే కంటెంట్ చాలా వేగంగా ఉత్పత్తి అవుతుంది. నిజమైన వాటికంటే అవే ఎక్కువ వేగంగా వైరల్ అవుతున్నాయి. దీనిని గమనించాలని అభ్యర్థిస్తున్నాను. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు దాన్ని పరిశీలించాలని కోరుతున్నా. వాస్తవాన్ని మాత్రమే ప్రజలకు అందించాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాను" అని రాసుకొచ్చారు. కానీ ఆ సినిమా పేరును మాత్రం రివీల్ చేయలేదు. దీంతో ఈ పోస్ట్ చూసిన వారంతా 'రామాయణ' గురించే అని చర్చించుకుంటున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.